# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :278 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: ఆదివారం 18-01-2026 | పేజీలు:4 వెల: 2.00


## స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

ముంబై, భారతీయులకు బంగారానికి విడదీయరాని అనుబంధం ఉంది. బంగారం అంటే ఇష్టపడని భారతీయుడు ఉండడంటే అతిశయోక్తికాదు. ఏ శుభకార్యం జరిగినా కూడా బంగారు ఆభరణాలకు ప్రత్యేక స్థానం ఉంటుంది. ఏడాది క్రితం లక్ష రూపాయలకు దిగువన ఉన్న బంగారం ధరలు ఊహించని స్థాయిలో పెరిగాయి. ప్రస్తుతం స్వచ్ఛమైన బంగారం ధర రూ.1,43,620 దగ్గర ట్రేడ్ అవుతోంది. గత కొద్దిరోజుల నుంచి చుక్కలు చూపిస్తున్న బంగారం ధరలు శుక్రవారాం స్వల్పంగా తగ్గాయి. బంగారం కొనాలనుకునే పేద, మధ్య తరగతి వారికి ఊరటను మాత్రం ఇవ్వడం లేదు. శుక్రవారం బంగారం ధరల విషయానికి వస్తే.. పది గ్రాముల 24, 22,18 క్యారెట్ల బంగారంపై వరుసగా రూ.220, రూ. 200, రూ.170లు తగ్గింది. ప్రస్తుతం దేశీ మార్కెట్‌లలో పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,43,620 పలుకుతోంది. అలాగే పది గ్రాముల 22 క్యారెట్ల ధర రూ.1,31,650 దగ్గర ట్రేడ్ అవుతోంది. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర రూ.1,07,720 వద్ద ట్రేడ్ అవుతోంది.

## సికింద్రాబాద్ అస్తిత్వాన్ని చెరిపేందుకు కుట్ర..



హైదరాబాద్, సికింద్రాబాద్ కు ఎంతో చరిత్ర ఉందని.. సికింద్రాబాద్ అస్తిత్వాన్ని తొలగించే విధంగా చేస్తున్నారని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. తాజాగా తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.గతంలో తుగ్లక్ గురించి పుస్తకాల్లో చదువుకున్నాం.. ప్రత్యక్షంగా తుగ్లక్ అంటే ఎలా ఉంటాడో కనిపిస్తుందని విమర్శించారు. మొట్టమొదటి పని టీఎస్‌ను టీజీగా చేశారు.. దీనివల్ల ఏ పేదవాడికి న్యాయం జరిగిందో తెలియదు.. తెలంగాణ తల్లిని తీసేసి కాంగ్రెస్ తల్లిని తీసుకొచ్చి పెట్టారన్నారు. ప్రజల దగ్గరికి పాలన పోవాలని అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందాలని వికేంద్రీకరణను ఒక విశాల దృక్పథంతోనే కేసీఆర్ ప్రారంభించారని.. కొత్త గ్రామాలు మండలాలు రెవెన్యూ డివిజన్లు జిల్లాలను ఏర్పాటు చేశారన్నారు. 10 జిల్లాలను 33 జిల్లాలుగా మార్చారని.. హైదరాబాదులోనూ వార్డులను జోన్లను పెంచడం జరిగిందన్నారు. వాటికి అభివృద్ధి నిధులను కూడా అధికంగా ఇవ్వడం జరిగిందని తెలిపారు.

హైదరాబాద్ సికింద్రాబాద్ అనేది తెలంగాణ ప్రజల గొప్ప అస్తిత్వం చిహ్నాలు.. కానీ రేవంత్ రెడ్డి తీసుకున్న తుగ్లకు నిర్ణయం వలన సికింద్రాబాద్‌కి చారిత్రక గుర్తింపు పూర్తిగా పోయేటట్లు ఉన్నదని అభిప్రాయపడ్డారు. సికింద్రాబాద్లోని అన్ని వర్గాల ప్రజలు ఒక్కటై.. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారని తెలిపారు. ప్రజలంతా సంఘటితమై.. మా పార్టీని ఆహ్వానించడం జరిగిందని.. అక్కడ ఉన్న ప్రజాప్రతినిధులు మొత్తం మా పార్టీకి చెందిన వార అన్నారు.సికింద్రాబాద్లో పుట్టిన బిడ్డలుగా సికింద్రాబాద్ అస్తిత్వాన్ని కాపాడాలని పోరాటం చేస్తున్నారు.. అధికారం ఇచ్చింది పట్టణాల అస్తిత్వాలను ప్రజల అస్తిత్వాలను గుర్తు లేకుండా చేరుపడం కోసం కాదని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు.. "అధికారం ఇచ్చింది గ్యారెంటీలను అమలు చేయడానికి అధికారం ఇచ్చింది ప్రజలు వారికి మంచి చేయాలని.. కానీ ఇలాంటి ఒక్క పని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి చేయడం లేదు.. హైదరాబాద్ నగరంలో రెండు సంవత్సరాలుగా ఒక్క ఇటుక కూడా పెట్టలేదు.. ఒక్క రోడ్డు కూడా వేయలేదు ఒక ఇల్లు కూడా కట్టలేదు.. కానీ నగరం మొత్తం తన విధ్వంసం ప్రణాళికలతోని ముందుకు పోతున్నారు.. ఈరోజు శాంతి ర్యాలీ పేరుతో సికింద్రాబాద్ ప్రజలు ప్రజాప్రతినిధులు ఒక కార్యక్రమాన్ని శాంతియుతంగా చేపట్టారు.. ప్రజల కోరిక మేరకు ప్రజాప్రతినిధులని కోరిక మేరకు తెలంగాణ భవన్ నుంచి బయలుదేరి వెళ్తామని సిద్ధంగా ఉన్నాం.. కానీ నిన్న రాత్రి వరకు అనుమతి ఉందని చెప్పి, ఇప్పుడు అనుమతి లేదని చెప్పి వేలాది మందిని కార్పొరేటర్లను, మాజీ కార్పొరేటర్ లను పార్టీ సీనియర్ నాయకులను సాధారణ ప్రజలను ఎక్కడికి అక్కడ అరెస్టు చేశారు.. ఇంత అరాచకంగా అక్రమంగా పనిచేస్తున్న ప్రభుత్వం అధికారం శాస్వతంగా కాదని గుర్తుపెట్టుకోవాలి.. ఇప్పుడున్న పదవిలో ఎల్లకాలం కొనసాగరు." అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

## తెలంగాణ భవన్‌లో కేటీఆర్, తలసానిని పోలీసులు నిర్బంధించారు: దాసోజు శ్రవణ్

హైదరాబాద్,సికింద్రాబాద్ అస్తిత్వం కాపాడుకునేందుకు బీఆర్ఎస్ శాంతియుత ర్యాలీకి పిలుపునిచ్చిన నేపథ్యంలో రాత్రి నుంచి వందలాది మంది పోలీసులు మోహరించారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తెలిపారు. అర్ధరాత్రి నుంచే వేలాది మందిని బైండోవర్లు చేస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్, తలసాని, ఇతర బీఆర్ఎస్ నేతలను నిర్బంధించారని చెప్పారు. సికింద్రాబాద్ నీ అయ్య జాగీరా.. అని సీఎం రేవంత్ రెడ్డిని దాసోజు శ్రవణ్ ప్రశ్నించారు. సికింద్రాబాద్ అస్తిత్వాన్ని నాశనం చేస్తావా అని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ఒక నియంత అని వ్యాఖ్యానించారు. సికింద్రాబాద్‌ది 200 ఏండ్ల చరిత్ర అని తెలిపారు. శాంతియుత ర్యాలీ చేయొద్దని గాంధీ చెప్పాడా? రాహుల్ గాంధీ చెప్పాడా అని మండిపడ్డారు. ఇప్పుడు ర్యాలీలపై జులుం చూపిస్తున్న నువ్వు ఎన్నిసార్లు ర్యాలీలు చేయలేదని ప్రశ్నించారు. సీఎం ఆఫీస్, ఈడీ ఆఫీసుల దగ్గర ధర్నాలు చేయలేదా అని నిలదీశారు.పోలీసులను ఉసిగొలిపి అడ్డమైన కేసులు పెడతారా అని కాంగ్రెస్ సర్కార్‌పై దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. అక్రమంగా జర్నలిస్టులను అరెస్టు చేయించారని తెలిపారు. నీకన్నా గొప్ప నియంతలు మట్టికొట్టుకుపోయారని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి.. నీకు టైమ్



దగ్గర పడిందని హెచ్చరించారు. ఆనాడు ఔరంగజేబు గోల్కొండపై దండెత్తి హైదరాబాద్ పేరు మార్చిందని గుర్తుచేశారు. మళ్లీ ఇవాళ రేవంత్ అనే నియంత సికింద్రాబాద్‌ను నామరూపాల్లేకుండా చేస్తున్నాడని మండిపడ్డారు. నిరసన తెలపడం ప్రజల ప్రజాస్వామిక హక్కు అని తెలిపారు. నువ్వెన్ని ఆంక్షలు పెట్టినా సికింద్రాబాద్ అస్తిత్వాన్ని కాపాడుకుంటామని స్పష్టం చేశారు.

## అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు.. సికింద్రాబాద్ కోసం మా పోరాటం ఆగదు




హైదరాబాద్,సికింద్రాబాద్ అస్తిత్వం కాపాడుకునేందుకు చేపట్టిన శాంతియుత ర్యాలీపై కాంగ్రెస్ సర్కార్ ఉక్కుపాదం మోపడంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు మండిపడ్డారు.కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యమే మా ఏడో గ్యారంటీ అని చెప్పిన రేంత్ రెడ్డి .. నేడు ప్రశ్నించే గొంతుకలను పోలీసులతో అణచివేస్తూ నిరంకుశత్వమే మా పాలసీ అని నిరూపిస్తున్నారని విమర్శించారు.సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సాధన కోసం మా పార్టీ సీనియర్ నాయకులు తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో జరుగుతున్న శాంతియుత ర్యాలీని అడ్డుకోవడం, కార్యకర్తలను అరెస్టు చేయడం హేయమైన చర్య అని విమర్శించారు. ఈ అరెస్టులను తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడతామని చెప్పి.. అధికారంలోకి వచ్చాక రాష్ట్రాన్ని పోలీస్ రాజ్యంగా మార్చడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. గాంధేయ మార్గంలో శాంతియుతంగా చేస్తున్న ర్యాలీని అడ్డుకోవద్దని, అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు.. మీ నిర్బంధాలకు భయపడేది లేదని స్పష్టం చేశారు. చారిత్రక సికింద్రాబాద్ అస్తిత్వం కోసం మా పోరాటం ఆగదని అన్నారు.

## ఈ పోరాటం ముగియలేదు.. బీఎంసీ చేజారడంపై ఉద్ధవ్ పార్టీ తొలిస్పందన

ముంబై:మహారాష్ట్రలో రాజకీయ యుద్ధం ఇంతటితో ముగిసినట్టు కాదని.. మరాఠా ప్రజలకు సముచిత గౌరవం దక్కేంత వరకూ ఈ పోరాటం కొనసాగుతుందని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పేర్కొంది.'యుద్ధం ఇప్పటితో ముగియలేదు. మరాఠా వ్యక్తులకు తగినంత గౌరవం దక్కేంత వరకూ ఈ పోరాటం ఇలాగే కొనసాగుతుంది' అని శివసేన యూబీటీ ట్వీట్ చేసింది.

### సీట్లు.. ఓట్లు

బీఎంసీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ, ఏక్‌నాథ్ షిండే శివసేన కూటమి ఏకైక పెద్ద కూటమిగా నిలిచింది. శివసేన(యూబీటీ), మహారాష్ట్ర నవనిర్మాణ సేన(ఎంఎన్ఎస్) కూటమి సైతం గణనీయంగా సీట్లు, ఓట్లు సాధించింది. ఎన్నికల కమిషన్ విడుదల చేసిన అధికారిక లెక్కల ప్రకారం.. బీజేపీ 89 సీట్లు గెలుచుకుంది. ఆ పార్టీకి 11,79,273 ఓట్లు పోలయ్యాయి. 21.58 శాతం ఓటింగ్ షేర్ సాధించింది. గెలిచిన అభ్యర్థుల్లో బీజేపీ ఓట్ షేర్ 45.22 శాతంగా ఉంది. దీంతో ఏకైక పెద్దపార్టీగా బీజేపీ నిలిచింది. బీజేపీ బుపార్టీ అయిన శివసేన(షిండే వర్గం) 29 సీట్లు గెలుచుకుంది. 2,77,326 ఓట్లు సాధించింది. మొత్తం ఓట్ షేర్‌లో 5 శాతం దక్కించుకుంది. బీజేపీ–శివసేన(షిండే) కలిసి బీఎంసీలో అతిపెద్ద కూటమిగా నిలిచింది.ఎంఎన్ఎస్‌తో కలిసి పోటీ చేసిన శివసేన(యూబీటీ) 65 సీట్లు గెలుచుకుంది. యూటీబీ సారథ్యంలోని సేనకు



7,17,735 ఓట్లు వచ్చాయి. మొత్తం పోలైన ఓట్లలో ఇది 13.13 శాతం. ఎంఎన్ఎస్ 6 సీట్లు దక్కించుకుంది. 74,946 ఓట్లు గెలుచుకుని.. 1.37 శాతం ఓట్ షేర్ సంపాదించింది. కాంగ్రెస్ పార్టీ 24 సీట్లు గెలుచుకుని 4.44 శాతం ఓట్ షేర్ సాధించింది. ఇతర పార్టీల్లో ఎఐఎంఐఎం 8 సీట్లతో 68,072 ఓట్లు సాధించింది. ఎన్సీపీ 3 సీట్లు, సమాజ్‌వాదీ పార్టీ 2 సీట్లు, ఎన్సీపీ(శరద్‌చంద్ర పవార్) పార్టీ ఒక సీటు గెలుచుకున్నాయి.

## నిరసన తెలిపే హక్కు మాకు లేదా.. కాంగ్రెస్ సర్కార్‌ను నిలదీసిన తలసాని

హైదరాబాద్,దరాబాద్‌లోని తెలంగాణ భవన్ వద్ద తలసాని మీడియాతో మాట్లాడుతూ.. నిరసన తెలిపే హక్కు మాకు లేదా అని ప్రశ్నించారు. శాంతియుత ర్యాలీలో పాల్గొంటారని ఎక్కడికక్కడ నిర్బంధాలు చేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు.సికింద్రాబాద్ అస్తిత్వాన్ని కాపాడుకుంటామని సనత్ నగర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ వద్ద తలసాని మీడియాతో మాట్లాడుతూ.. నిరసన తెలిపే హక్కు మాకు లేదా అని ప్రశ్నించారు. శాంతియుత ర్యాలీలో పాల్గొంటారని ఎక్కడికక్కడ నిర్బంధాలు చేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు.రాత్రికి రాత్రే వేలాది మంది పోలీసులు మోహరించారని తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ర్యాలీకి అనుమతి లేదంటూ బీఆర్ఎస్ నేతలను అడ్డుకున్నారని పేర్కొన్నారు. శాంతియుత ర్యాలీ చేస్తామంటే ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. ర్యాలీ కోసం ఎప్పుడో దరఖాస్తు చేశామని తెలిపారు. కానీ నిన్న రాత్రి అనుమతి లేదని పోలీసులు చెప్పారని పేర్కొన్నారు. పోలీసులు అనుమతి ఇవ్వకపోతే కోర్టు ద్వారా అనుమతి తెచ్చుకుని ర్యాలీ



నిర్వహిస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ వాళ్లేమో ఇష్టానుసారంగా ర్యాలీలు చేసుకుంటున్నారని.. ప్రతిపక్షలను మాత్రం అడ్డుకుంటున్నారని విమర్శించారు. ర్యాలీకి నిన్న ఓకే చెప్పి.. రాత్రికి రాత్రే అనుమతి లేదన్నారని మండిపడ్డారు.

## మాజీ సీఎంను నోటికొచ్చినట్లు మాట్లాడి.. కాంగ్రెస్ ను గెలిపించిన బీజేపీ!



ముంబై:ఘాటు విమర్శలు చేయటం.. నోటికి ఎంత వస్తే అంతలా మాట్లాడటమే రాజకీయం కాదు. తాను మాట్లాడే మాటల్ని జనాలు పెద్దగా పట్టించుకోరన్న వాదనలో పస లేదన్న విషయం తాజాగా వెలువడిన మహారాష్ట్ర స్థానిక ఎన్నికలు చెప్పకనే చెప్పేశాయి. సుదీర్ఘ విరామం తర్వాత ఎన్సీపీ.. ఠాక్రే సోదరులు చెట్టాపట్టాలేసుకొని వేర్వేరుగా పోటీ చేసినా.. వీరికి ఓటమి తప్పలేదు.ఇదంతా ఒక ఎత్తు అయితే.. మహారాష్ట్రలోని లాతూర్ స్థానిక ఎన్నికల ఫలితం మాత్రం మిగిలిన వాటికి భిన్నంగా చోటు చేసుకోవటమే ఇందుకు కారణమని తెలిస్తే విస్మయానికి గురి కావాల్సిందే. అసలేం జరిగిందంటే.. మహారాష్ట్రలో జరిగిన స్థానిక ఎన్నికల ఫలితాలు వెలువడగా.. చాలా చోట్ల బీజేపీ అధిక్యంలో ఉ ంటే.. అందుకు భిన్నంగా లాతూరు మున్సిపల్ కార్పొరేషన్ లో మాత్రం ఆ పార్టీ ఓటమిపాలై.. అనూహ్య రీతిలో కాంగ్రెస్ గెలుపొందటం హాట్ టాపిక్ గా మారింది. అదెలా సాధ్యమైందంటే.. బీజేపీ ముఖ్యనేత నోటి దూలతోనే ఇలా జరిగిందని చెప్పాలి.ఎన్నికల ప్రచారానికి ముందు లాతూర్ లో పార్టీ కార్యకర్తలతో సమావేశమైన మహారాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రవీంద్ర చవాన్.. అనూహ్య రీతిలో మాజీ ముఖ్యమంత్రి విలాస్ రావ్ దేశ్ ముఖ్ పై విమర్శలు గుప్పించారు. ఆయన సొంతూరులో ఆయన గురుతులు తుడిచి పెట్టేయాలని కార్యకర్తలకు పిలుపునివ్వటం వివాదంగా మారింది. మహారాష్ట్ర డెవలప్ మెంట్ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ముఖ్యనేతను తక్కువ చేసి మాట్లాడటాన్ని అక్కడి ప్రజలు అస్సలు తట్టుకోలేకపోయారు.మహారాష్ట్రకు ముఖ్యమైన ఒక నేతను ఉ ద్దేశించి తక్కువ చేసి మాట్లాడటాన్నితీవ్రంగా ఖండించిన కాంగ్రెస్ భావోద్వేగాన్ని తగిన మోతాదులో దట్టించింది. అదే సమయంలో మాజీ ముఖ్యమంత్రి కం బాలీవుడ్ నటుడు రితేశ్ దేశ్ ముఖ్ స్పందిస్తూ.. సామాన్యుల మనసుల్లో నుంచి తన తండ్రి గురుతుల్ని చెరిపేయరంటూ చేసిన వీడియో ప్రకటనకు లాతూరు వాసులు ఇట్టే కనెక్టు అయ్యారు.దీంతో తన మాటలతో జరిగిన డ్యామేజ్ ను గుర్తించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు స్పందిస్తూ.. తాను సీరియస్ కామెంట్లు చేయలేదన్న డ్యామేజ్ కంట్రోల్ వ్యాఖ్యలు చేశారు. అంతేకాదు.. తన వ్యాఖ్యల్ని వెనక్కి తీసుకుంటూ క్షమాపణలు కూడా చెప్పేశారు. అయితే.. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. 2017లో లాతూరు మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ 36 సీట్లతో విజయం సాధిస్తే.. ఈసారి కాంగ్రెస్ పార్టీ 43 సీట్లతో తిరుగులేని అధిక్యతను ప్రదర్శించింది. మొత్తంగా ముఖ్య నేత నోటి దూల కీలక మున్సిపాలిటీని మిస్ చేసుకునేలా చేసిందని చెప్పాలి.

## పట్టుసాధించిన ఎంఐఎం...


ముంబై: మహారాష్ట్ర మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఎంఐఎం పార్టీ సత్తా చాటింది. ముంబైతోపాటు మరాఠ్వాడాలోని మున్సిపల్ కార్పొరేషన్‌లలో ఎంఐఎం పార్టీ తన ప్రభావం చూపింది.రాష్ట్రంలోని 29 మున్సిపల్ కార్పొరేషన్‌లకు జరిగిన ఎన్నికల్లో మొత్తం 125 స్థానాలను దక్కించుకుని తన పట్టును పెంచుకు ంది. రాష్ట్రంలోని ముస్లిం ఓటర్లు ఎంఐఎంకు పెద్దఎత్తున మద్దతు పలికినట్టు ఫలితాలను బట్టి తెలుస్తోంది. ముస్లిం ఓటర్లు కాంగ్రెస్, ఎన్సీపీలను తిరస్కరించి ఎంఐఎంవైపు మొగ్గుచూపారని తాజా ఎన్నికల ఫలితాలతో స్పష్టమైంది.

### ఛత్రపతి సంభాజీనగర్‌లో హవా

ఛత్రపతి సంభాజీనగర్ (ఔరంగాబాద్) మున్సిపల్ కార్పొరేషన్‌లో గతంలోకంటే అధికంగా 33 స్థానాలు దక్కించుకుని రెండవ అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఇక్కడ కాంగ్రెస్, ఇరు ఎన్సీపీలు, ఇరు శివసేనల కంటే అధిక స్థానాలు దక్కించుకోవడం విశేషం. ముఖ్యంగా ఎంఐఎం ఎంపీ సయ్యద్ ఇంతియాజ్ జలీల్ నేతృత్వంలో జరిగిన ఈ ఎన్నికల్లో మరోసారి ఆయన తన సత్తాను చాటుకున్నారు. ఎన్నికల ప్రచారం సమయంలో ఆయనపై దాడి జరిగింది. దీంతో ఇంతియాజ్ జలీల్ ఈ ఎన్నికలకు మరింత ప్రతిష్ఠాత్మంగా తీసుకుని ప్రచారం చేసి 33 స్థానాలను దక్కించుకున్నారు.

### అమరావతి, నాందేడ్‌లలో..

మాలేగావ్, నాందేడ్, అమరావతి, ధులే, ముంబై, షోలాపూర్, నాగపూర్, థానే(ముంబ్రా) మున్సిపల్ కార్పొరేషన్‌లలో కూడా ఎంఐఎం తన ప్రభావం చూపింది. ముఖ్యంగా మాలేగావ్‌లో 20 స్థానాలు దక్కించుకోగా నాందేడ్‌లో 15, అమరావతిలో 12, ధులేలో 10 చోట్ల విజయం సాధించింది. ముంబైలో




8, షోలాపూర్‌లో 8, నాగపూర్‌లో 6, థానేలో 5 స్థానాల్లో గెలిచింది. అకోలా (3), జాల్నా (2), అహ్మద్‌నగర్ (2) లలో ఉనికిని చాటుకుకుంది. చంద్రాపూర్‌లో మొట్టమొదటి సారిగా ఒక్కస్థానం దక్కించుకుని బోణి కొట్టింది.

### మహారాష్ట్ర ప్రజలకు ఒవైసీ ధన్యవాదాలు

మహారాష్ట్ర మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో తమ పార్టీకి చెందిన 125 మంది కార్పొరేటర్లు విజయం సాధించారని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ తెలిపారు. తమ పార్టీకి ఓటు వేసిన మహారాష్ట్ర ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. తమ పార్టీ కార్పొరేటర్లు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తారని అన్నారు. "మా కార్పొరేటర్లందరూ ప్రజల మధ్యే ఉండి, మీ వార్డులలో అభివృద్ధి పనులు చేపట్టాలని నేను గట్టిగా కోరుతున్నాన"ని ఎక్స్‌లో పేర్కొన్నారు.

## ఇరాన్ అల్లర్ల మధ్య నుంచి బయటపడ్డ భారతీయులు..



న్యూఢిల్లీ, అల్లర్లతో అట్టుడుకుతున్న ఇరాన్ నుంచి పలువురు భారతీయులు క్షేమంగా స్వదేశానికి చేరుకున్నారు. భారత ప్రభుత్వం జారీ చేసిన హెచ్చరికల నేపథ్యంలో శుక్రవారం రాత్రి వారు ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. క్లిష్ట పరిస్థితుల్లో తమను సురక్షితంగా భారత్‌కు తీసుకొచ్చినందుకు కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీకి వారు కృతజ్ఞతలు తెలిపారు.ఇరాన్‌లో ఆర్థిక సంక్షోభం, కరెన్సీ పతనం కారణంగా గత ఏడాది డిసెంబర్ చివరి నుంచి దేశవ్యాప్తంగా తీవ్ర నిరసనలు కొనసాగుతున్నాయి. భద్రతా పరిస్థితులు క్షీణించడం, ఇంటర్నెట్ సేవలు పూర్తిగా నిలిచిపోవడం వల్ల అక్కడ నివసిస్తున్న భారతీయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. కుటుంబ సభ్యులతో సంబంధాలు తెగిపోవడంతో భారత్‌లో ఉన్న వారి బంధువులు ఆందోళన చెందారు.ఈ నేపథ్యంలో భారత విదేశాంగ శాఖ, టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం పలుమార్లు హెచ్చరికలు జారీ చేసింది. అందుబాటులో ఉన్న వాణిజ్య విమానాల ద్వారా వీలైనంత త్వరగా స్వదేశానికి చేరుకోవాలని భారతీయులకు సూచించింది. ఆ సూచనల మేరకు పలువురు భారత్‌కు తిరిగివచ్చారు.

సంపాదకీయం

ఆదివారం 18-01-2026

# రాష్ట్రాల పురోగతి లక్ష్యంగా బడ్జెట్ కేటాయింపులు !

ఇటీవల ఆయా రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో చర్చించారు. ఆయా రాష్ట్రాల మంత్రులు వారివారి రాష్ట్రాల్లో ఉన్న అవసరాలను, నిధుల కేటాయింపులపై వినతిపత్రాలు సమర్పించారు. తెలుగు రాష్ట్రాల నుంచి భట్టి విక్రమార్క, పయ్యావుల కేశవులు హాజరై తమ అవసరాలను, ఆకాంక్షలను వెల్లడించారు. అయితే ఏటా కేటాయింపులు చేస్తున్నా.. ఇప్పటి వరకు ప్రకటించిన కేటాయింపులు, ఖర్చులపై స్పష్టత లేదు. ఏ పథకానికి ఎంత ఖర్చు చేశారో తెలియదు. అలాగే అన్ని రాష్ట్రాలను సమానంగా చూస్తూ కేటాయింపులు ఉండాలి. బడ్జెట్ అంటే అభివృద్ధి దిశగా చర్యలు ఉండాలి. అనుకూల రాష్ట్రాలకు ఒక రకంగా, తమ పార్టీ పాలనలో లేని రాష్ట్రాలను మరో రకంగా చూసే విధానాలకు పాతరేయాలి. బడ్జెట్ అందరికి సమాన హక్కుగా ఉండాలి. అది దేశ ప్రగతిని ప్రతిఫలించాలి. తమకు మద్దతు ఇస్తున్న పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు ఒక రకంగా, మిగతా రాష్ట్రాలను మరో రకంగా చూసు విధానం సరికాదు. మరికొద్ది రోజుల్లో పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు జరగనుండగా, దానికి సన్నాహంగా ఇటీవల నిర్వహించిన ప్రీ బడ్జెట్ సమావేశంలో రాష్ట్రాల ఈ దైన్య స్థితి స్పష్టంగా వెలుగులోకి వచ్చింది. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కేంద్రంలో ఎన్‌డిఎ కూటమికి చెందిన పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలు సైతం నిధుల కోసం గళం విప్పాల్సి రావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. తమ తమ రాష్ట్రాల్లో నెలకొన్న దుర్భర పరిస్థితులను వివరిస్తూ అదనపు నిధులు కావాలని, జిఎస్‌టి పరిహారం కొనసాగించాలని సమావేశంలోనే ఆ రాష్ట్ర ప్రభుత్వాలు విజ్ఞప్తులు చేశాయి. పన్నుల వసూళ్లలో రాష్ట్రాల వాటా తగ్గిస్తూ, గ్రాంట్లు ఆలస్యం చేస్తూ, అప్పుల పరిమితులను కట్టడి చేస్తూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరే రాష్ట్రాల ఈ దుస్థితికి కారణం. సిపిఎం నేతృత్వంలో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం అధికారంలో ఉన్న కేరళ రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం మరింత కక్ష పూరితంగా వ్యవహరిస్తోంది. ఆర్థికంగా దిగ్బంధించడం ద్వారా వామపక్ష ప్రజాతంత్ర సంఘటన ప్రభుత్వ ప్రతిష్టను ప్రజల్లో దిగజార్చే కుటిల వ్యూహానికి బిజెపి తెగబడుతోంది. ఇలా దాదాపు లక్ష కోట్ల రూపాయల మేర ఆ రాష్ట్రానికి రావాల్సిన నిధులను కేంద్రం మంజూరు చేయడానికి నిరాకరిస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. గత ఐదేళ్లలోనే 57వేల కోట్ల రూపాయలకు కోత పెట్టింది. పన్నుల వాటాను 3.89 శాతం నుండి 1.92 శాతానికి తగ్గించింది. ఈ చర్య వల్ల 2024-25 ఆర్థిక సంవత్సరంలోనే కేరళ ప్రజలు 27 వేల కోట్ల రూపాయలు నష్టపోయారు. జిఎస్‌టి సంస్కరణల ద్వారా మనో 9వేల కోట్లను ఆ రాష్ట్రం కోల్పోయింది. త్వరలో ఎన్నికలు జరగనున్నఈ రాష్ట్రంలో ఈ తరహా రాజకీయ కక్ష సాధింపు చర్యలు పతాకస్థాయికి చేరడంతో కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ సత్యాగ్రహం చేయాల్సి వచ్చింది. ఇకపోతే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ ఆర్థిక దిగ్బంధనంపై కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ పెదవి విప్పక పోవడం పచ్చి అవకాశవాద రాజకీయం తప్ప మరోటి కాదు. ఏమైనప్పటికీ ఈ తరహా ఏకపక్ష విధానాలను నరేంద్రమోదీ ప్రభుత్వం ఇప్పటికైనా విడనాడాలి. రాజ్యాంగ బద్ధమైన రాష్ట్రాల హక్కులను గౌరవించాలి. లేని పక్షంలో ఈ తరహా ఆందోళనలు మరిన్ని రాష్ట్రాల్లో చోటుచేసుకునే అవకాశం ఉంది. బలమైన రాష్ట్రాలే కేంద్రాన్ని బలంగా నిలబెడతాయి. స్థిరమైన ఆర్థిక వనరులతోనే బలంగా నిలుస్తాయి. సమాఖ్య వ్యవస్థ పురోగతికి అత్యంత కీలకమైన ఈ అంశంపైనే నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర బిజెపి ప్రభుత్వం దాడి చేస్తోంది. ఆర్థిక హక్కులను క్రమేణా హరిస్తోంది. ఫలితంగా రాష్ట్రాలు ప్రతి చిన్న అవసరానికి కేంద్రం దయా దాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.ప్రీ బడ్జెట్ సమావేశంలో రాష్ట్ర తరఫున పాల్గొన్న తెలంగాణ ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క అనేక విషయాలను నిర్మలా సీతారామన్ ముందుంచారు. ఫ్యూచర్ సిటీ, నవోదయలు, మూసీ సుందరీకరణ, రోడ్ల విస్తరణ, ఎస్సీఆర్ఎస్పికి జాతీయ హోదా ,ట్రిపుల్ ఆర్ వంటి అనేక అంశాలను, నిధుల కేటాయింపులను ప్రస్తావించారు. వీటికి కేంద్రం బడ్జెట్‌లో ఏ రకమైన స్పందన చూపిస్తుందో చూడాలి. అలాగే ఏపికి చెందిన మంత్రి పయ్యావుల కేశవ్ కూడా కోరికల చిట్టా విప్పారు. రాష్ట్ర రాజధాని అమరావతి నగర నిర్మాణ పనులకు సాయాన్ని కొనసాగించాలని ఆయన కోరారు. విభజన హామీల్లో భాగమైన పోలవరం ప్రాజెక్టుకు పూర్తి నిధులు ఇవ్వాలని, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే విశాఖపట్నం, రాయలసీమ ప్రాంతాల మౌలిక సదుపాయాల కోసం అదనపు కేటాయింపులు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.రాష్ట్ర ప్రభుత్వం ఈ కోరికలు కోరడం ఇదే మొదటి సారికాదు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఢల్లీ పర్యటనకు వెళ్లిన ప్రతిసారీ దాదాపుగా ఇవే అంశాలను ప్రధాన మంత్రి నుండి మంత్రుల వరకు వ్యక్తిగతంగా కలిసి ఈ మేరకు విజ్ఞప్తులు చేస్తూనే ఉన్నారు. ఢిల్లీలో ఉన్న రాష్ట్ర ఎంపీలు, పర్యటనలకు వెళ్లే మంత్రులు ఇదే పనిమీద ఉంటున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయినా, కేంద్రం నుండి నిధులు రావడం లేదు. మన రాష్ట్రమే కాదు, ఎన్‌డిఎలో మరో భాగస్వామిగాఉన్న బీహార్ ప్రభుత్వం నుండి కూడా ఇటువంటి విజ్ఞప్తులే అందాయి. పలు బిజెపి పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు కూడా జిఎస్‌టి నష్టపరిహారం, గ్రాంట్లు పెంపు, ప్రత్యేక ప్యాకేజీలు కోసం కేంద్రాన్ని కోరినట్లు వార్తలు వచ్చాయి. నిధుల కేటాయింపుల్లో సమతుల్యత పాటించాలి. విభేదాలు పక్కన పెట్టాలి. అప్పుడే కేంద్ర, రాష్ట్రాల మధ్య సయోధ్య సాధ్యం అవుతుంది.

# దక్షణాదికే వన్నె తెచ్చిన రాజనీతిజ్ఞుడు



హైదరాబాద్,సునిశిత రాజకీయ పరిశీలన, లోతైన అవగాహన, విశ్లేషణ, వ్యక్తీకరణ కలగలిపిన లక్షణాలు కలిగిన అతికొద్ది మంది జాతీయ నాయకులలో జైపాల్ రెడ్డి ఒకరు. సమరశీల వ్యక్తిత్వం, విశిష్టమైన శైలి, భావస్పష్టత, భావవ్యక్తీకరణ అనే సుగుణాల వల్లనే విద్యార్థి నాయకుని నుంచి జాతీయ స్థాయికి ఎదిగి దేశ రాజకీయ – చిత్రపటంపై జైపాల్‌రెడ్డి చెరగని ముద్రవేశారు. విజ్ఞత, రాజకీయ చతురత, పాలనా పటిమ, ఎలాంటి బాధ్యతలు అయినా నిరూపమాన దక్షతతో నిర్వహించగలిగే లక్షణాలు ఒకే వ్యక్తిలో ఉండటం చాలా అరుదు. అటు జాతీయ, ఇటు రాష్ట్ర రాజకీయాలను తనదైన శైలిలో ప్రభావితం చేసిన జైపాల్‌రెడ్డి ఈ లక్షణాలన్నింటిని పుణికి పుచ్చుకున్నారంటే అతిశయోక్తి కాదు. జాతీయ రాజకీయాలు తీసుకున్న ప్రతి మలుపులోనూ జైపాల్‌రెడ్డి ముద్ర ఉంది. దశాబ్దాలపాటు జాతీయ రాజకీయాల్లో కీలక భూమిక పోషించిన జైపాల్‌రెడ్డి అజాత శత్రువు. సిద్ధాంతాలకు అతీతంగా అన్ని పార్టీల అగ్రనేతలు ఆయనను అభిమానించేవారు. వారంతా ఆయకు అత్యంత ఆప్తులు, సన్నిహితులు కూడా. ఏ పార్టీలో ఉన్నా ఆ పార్టీకి వన్నె తేవడంతో అందరినీ కలుపుకుపోవడం, అరమరికలు లేని స్నేహశీలత జైపాల్ రెడ్డికే సొంతం.ఆయన రాజకీయ జీవితంలోని ప్రతి దశ ఒక అద్భుత ఘట్టమే. విజ్ఞాన భాడాంగారం అన్న మాటకు ఆయన తిరుగులేని తార్కాణం. స్వతహాగా తన స్నేహ శీలత స్వభావంతోపాటు మచ్చలేని వ్యక్తిత్వం జైపాల్ రెడ్డిని రాజకీయ రంగంలో ఉన్నత శిఖరాలకు చేర్చించింది. ఏ అంశంపైన అయినా విశ్లేషణాత్మకంగా, అనర్గళంగా మాట్లాడటం జైపాల్‌రెడ్డికి వెన్నతోపెట్టిన విద్య. నాటి జనతా పార్టీనుంచి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు వరకు జైపాల్‌రెడ్డి అప్రతిహత రాజకీయ పయనం వివేచన, విచక్షణ మేళవించిన ఆయన నిండైన జీవితానికి నిదర్శనం. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేస్తూ పార్లమెంట్ లో బిల్లు పాస్ కాగానే తెలంగాణ ఉద్యమనేత, కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు మొట్టమొదట ఢిల్లీలో జైపాల్ రెడ్డి ఇంటికి వెళ్లి ధన్యవాదాలు తెలిపారంటే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటులో ఆయన ఎంతటి కీలక భూమిక పోషించారో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. మాజీ ఎంపి ఉండవల్లి అరుణకుమార్ – రాష్ట్ర విభజనపై రచించిన 'విభ –జన కథ' పుస్తకంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటులో జైపాల్‌రెడ్డి నిర్వహించిన పాత్రపై చాలా వివరంగా రాశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత జరిగిన ఎన్నికల సందర్భంగా రాష్ట్రం ఏర్పాటులో జైపాల్ రెడ్డి పాత్ర లేదని కొందరు టిఆర్ఎస్ నాయకులు చేసిన విమర్శలపై స్పందిస్తూ, 'తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కెసిఆర్ స్వయంగా మా ఇంటికి వచ్చి 'అన్నా.. కొత్తగా ఏర్పడే తెలంగాణ రాష్ట్రానికి మీరే ముఖ్యమంత్రిగా ఉండాలి' అని కోరితే సున్నితంగా తిరస్కరించిన విషయాన్ని గుర్తు చేశారు.రాష్ట్రం ఏర్పాటులో తన పాత్రేమీ లేకపోతే తనను సిఎంగా ఉండాలని కెసిఆర్ ఎందుకన్నారో, ఆయన్నే అడిగి తెలుసుకోండని జైపాల్‌రెడ్డి వారికి బదులిచ్చారు. దక్షణాది నుంచి మొట్టమొదటగా ఉత్తమ పార్లమెంటేరియన్‌గా అరుదైన పురస్కారాన్ని అందుకున్న గొప్ప రాజనీతిజ్ఞుడు కూడా. చిన్నతనంలోనే రెండూ కాళ్లూ పోలియో కారణంగా పని చేయకపోయినా, తన అంగ వైకల్యం రాజకీయ పురోగతికి, పరిణితికి ఎక్కడా అడ్డురాలేదు. మాజీ ప్రధానులు విపి సింగ్, దేవెగౌడ, ఐకె గుజ్రాల్, మన్మోహన్ సింగ్‌కు అంతరంగ సన్నిహితునిగా ఉంటూ క్లిష్ట సమయాల్లో పలు కీలక అంశాలలో సూచనలు, సలహాలు ఇచ్చిన గొప్ప మేధావి, గొప్ప రాజనీతిజ్ఞుడు కూడా. జనతాదళ్, నేషనల్ ఫ్రంట్, యూనైటెడ్ ఫ్రంట్‌కు జాతీయ అధికార ప్రతినిధిగా వ్యవహరించి ప్రత్యర్థులను సైతం ఒప్పించి, మెప్పించగలిగిన రాజకీయ దురంధరుడాయన. రాజకీయాలలో విలువలకు, సిద్ధాంతాలకు చివరిదాకా కట్టుబడిన గొప్ప వ్యక్తిత్వం జైపాల్‌రెడ్డికే సొంతం. నాలుగున్నర దశాబ్దాల తన రాజ కీయ జీవితంలో కనీసం ఒక్క ఆరోపణను కూడా ఎదుర్కోని నిజాయితీపరుడు కావడం మరో విశేషం. జైపాల్ రెడ్డి వ్యక్తిత్వం గురించి ఒక సందర్భంలో జనతాదళ్ సిద్ధాంతకర్త సురేంద్రమోహన్ విశ్లేషిస్తూ, విభిన్న మనస్తత్వాలుగల కింగ్ మేకర్లతో, కుయుక్తులకు పాల్పడే రాజకీయ నాయకులతో చాకచక్యంగా వ్యహరించగల సత్తాగల నాయకుడి' గా అభివర్ణించారు. 'ఆయన ఎవరినైనా సమర్థంగా తన దారిలోకి తెచ్చుకోగలరు' అని కూడా కితాబు ఇచ్చారు. దేశ రక్షణ అంశాలు, ప్రపంచ వర్తక, వాణిజ్య ఒప్పందాలపైనా,జాతీయ, అంతర్జాతీయ సామాజిక అంశాలపైనా జైపాల్ రెడ్డికి ఉన్న పరిజ్ఞానం, విశ్లేషణలు రాజకీయ పండితులను సైతం అబ్బురపర్చే విధంగా ఉండేవి. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా జైపాల్‌రెడ్డికి అరుదైన గౌరవం దక్కినప్పుడు.. ఈ బిరుదుకు అసలు సిసలైన అర్హుడిగా ఆయన రాజకీయ ప్రత్యర్థులు సైతం కొనియాడారు. ఏ అంశంలోనైనా లోతైన సునిశిత అధ్యయనం, అవగాహన, విశ్లేషణకు గుర్తింపుగానే.. కేంద్ర సమాచార, ప్రసారాలశాఖ, సైన్స్ అండ్ టెక్నాలజీ, పెట్రోలియం వంటి కీలక మంత్రిత్వశాఖలను జైపాల్‌రెడ్డికి అప్పగించడానికి మరో కారణం. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ, లోక్‌పాల్‌పై ఏర్పాటు చేసిన జాయింట్ సెలెక్ట్ కమిటీ, సెక్యూరిటీల కుంభకోణంపై ఏర్పాటు చేసిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ తదితర వాటిలో కూడా సభ్యునిగా నియమించడానికి కారణం కూడా ఇదే. నిజాయితీకే కాకుండా నిరాండంబరానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తారు..విపి సింగ్‌కు అత్యంత సన్నిహితునిగా వ్యవహరించినప్పటికీ ఆయన హయాంలో కేంద్ర మంత్రి పదవిని ఆశించలేదు. 'మీకు ఎంతో సన్నిహితుడు కదా? మంత్రి పదవి ఎందుకు ఇవ్వలేదని?' అడిగితే, 'నేను అడుగలేదు.. ఆయన ఇవ్వలేదు' అని నవ్వేవారు. అంతటి స్థితప్రజ్ఞత జైపాల్‌రెడ్డిది. ప్రధాని ఐకె గుజ్రాల్ తన మంత్రి వర్గంలో జైపాల్ రెడ్డిని చేర్చుకున్నప్పుడు లోక్‌సభ, రాజ్యసభ దేంట్లోనూ ఆయన సభ్యుడు కాకపోయినప్పటికీ కేంద్ర సమాచార, ప్రసారాలశాఖ మంత్రిగా నియామకం కావడం అసాధారమైన విషయమే. ఆకాశవాణి, దూరదర్శన్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించే 'ప్రసార భారతి' చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయగలిగిన శక్తియుక్తి జైపాల్‌రెడ్డికి మాత్రమే ఉందని మంత్రివర్గంలోకి తీసుకున్నట్టు ఒక సందర్భంలో ప్రధాని ఐకె గుజ్రాల్ వ్యాఖ్యానించడం గమనార్హం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కె రోశయ్య తర్వాత ముఖ్యమంత్రిగా –జైపాల్ రెడ్డిని పంపించాలని ఒక దశలో కాంగ్రెస్ అధిష్టానం పెద్దలు ప్రతిపాదిస్తే, తానే సున్నితంగా తిరస్కరించిన విషయాన్ని తన అంతర్గత సంభాషణలలో జైపాల్‌రెడ్డి గుర్తు చేసేవారు.తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం తారస్థాయికి చేరుకున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి పదవి తీసుకుంటే తప్పుడు సంకేతాలు వెళ్తాయనీ, ముఖ్యమంత్రి పదవి కోసం తాను ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం డిమాండ్ తాకట్టు పెట్టారన్న అపప్రదను మోయాల్సి వస్తుందని, ఆ ప్రతిపాదనను తిరస్కరించడానికి కారణమని తన సన్నిహితుల వద్ద చెప్పేవారు. జైపాల్‌రెడ్డి జాతీయస్థాయిలో రాణించడానికి అనేక కోణాలు దోహదం చేశాయి. క్షత్రస్థాయి నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయి వరకు ఏ అంశంపైనైనా లోతైన అవగాహన, విశ్లేషణ, బహు భాషా ప్రావీణ్యం, రాజకీయ చతురత, చతురోక్తులు, మంచి వక్త కావడం దోహదం చేశాయి. అసెంబ్లీ, పార్లమెంట్‌లో మాట్లాడినా, ప్రెస్ మీట్లు, బహిరంగ సభలలో మాట్లాడినా ఎంతటి జటిల మైన అంశాన్ని కూడా సామాన్యులకు కూడా అర్థమయ్యే రీతిలో చెప్పడం జైపాల్‌రెడ్డి ప్రత్యేకత. ఆయన పద ప్రయోగాలు, వ్యంగ్యోక్తులు సభలు, సమావేశాల్లో నవ్వుల్లో ముంచెత్తేవి. రాష్ట్ర రాజకీయాలలో కొనసాగినప్పుడు శాసనసభలో జైపాల్‌రెడ్డి, వెంకయ్యనాయుడు చేసే ప్రసంగాలను ఆకాశవాణిలో వినడానికి జనం ఎగబడేవారు. శాసనసభలో తమను తిరుపతి వెంకటకవులుగా పిలిచేవారని ఒక సందర్భంలో వెంకయ్యనాయుడు గుర్తు చేశారు.ఎంతటి వివాదాస్పద అంశాలపైన అయినా వివాదాల్లో చిక్కుకోకుండా ఆచితూచి మాట్లాడటం జైపాల్‌రెడ్డికున్న మరో ప్రత్యేకత. ఆంగ్లం, తెలుగు భాషలపై ఉస్మానియా విశ్వవిద్యాల యంలో మాస్టర్ డిగ్రీ చేసిన జైపాల్‌రెడ్డికి ఆంగ్ల భాషపై ఉన్న పట్టు అసమానం. పార్లమెంట్‌లో, మీడియా సమావేశాల్లో ఆయన వాడిన

# జన సంద్రమైన కొత్తకొండ.. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన జాతర

భీమదేవరపల్లి,హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని గురు, శుక్రవారాల్లో లక్షలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కోనేరులో పవిత్ర స్నానాలు ఆచరించారు. కోరిన కోరికలు తీర్చాలని స్వామివారికి కోర మీసాలు సమర్పించుకున్నారు. తమ గండాలు తొలగిపోవాలని గండా దీపంలో నూనె పోశారు. వీరభద్రుని సన్నిధిలో కోడె ప్రదక్షణ చేశారు. గుమ్మడికాయ మొక్కులు చెల్లించుకున్నారు.స్వామివారి దర్శనం కోసం భక్తులు గంటల తరబడి క్యూ కట్టారు. భక్తులు అధికం కావడంతో శీఘ్ర దర్శనం, విఐపి క్యూలైన్లు సైతం కిక్కిరిసిపోయాయి. జాతరలోని దుకాణాలు, రంగులరాట్నం, సర్కస్ తదితర షాపులన్నీ రద్దీగా మారాయి. జాతరలో భక్తుల సౌకర్యార్థం వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బందులు వాటిల్లకుండా ఆలయ చైర్మన్ అశోక్ ముఖర్జీ, ఈవో కిషన్ రావు పూర్తి సదుపాయాలు కల్పించారు.

మేకల బండి ప్రదక్షణ..

మకర సంక్రాంతి పర్వదినం గురువారం అర్ధరాత్రి ఆనవాయితీ ప్రకారం వరంగల్ జిల్లా వేలేరు కు చెందిన యాదవులు డబ్బు చప్పుళ్ళు, శివసత్తులు నృత్యాల మధ్య మేకల బండితో ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేశారు. అనంతరం ఎడ్లబండ్లతో వచ్చిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి గుట్టపైన కొలువుదీరిన వీరభద్ర స్వామి ఆత్మలింగం ఆలయంలో దివ్యాలంకరణ పూజలు జరిగాయి. గుట్టపైకి వెళ్ళిన భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.గుట్టపైకి వెళ్లి ప్రకృతి రమణీయతను వీక్షంచేందుకు యువత పోటీపడ్డారు. మాజీ ప్రధాని దివంగత పీవీ నరసింహారావు స్వగ్రామం వంగర లోని అతని ఇంటి నుంచి కొత్త కొండకు ఎడ్ల బండి రథం మకర సంక్రాంతి రోజున వెళ్లడం అనవాయతీగా వస్తుంది. ఈ ఏడాది సైతం ఎడ్ల బండి రథాన్ని అందంగా అలంకరించారు. శివ సత్తుల నృత్యాలు, మహిళల కోలాటాల నడుమ ఎడ్ల బండి రథాన్ని కొత్తకొండకు గ్రామస్తులు అంగరంగ వైభవంగా సాగనంపారు.

కొత్త కొండకు కొత్తపల్లి రథాలు..

బండెనుక బండి కట్టి పదహారు బండ్లు కట్టి అనే చందంగా కొత్తపల్లి నుంచి కొత్తకొండకు వెళ్లిన ఎడ్లబండ్లు రథాలను తలపించాయి. ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది సైతం సుమారు 72 వరకు ఎడ్లబండ్లను బంతిపూలతో వివిధ రంగులతో అందంగా అలంకరించి రథాలుగాతీర్చిదిద్దారు. కొత్తకొండ వరకు సాగిన ఎడ్ల బండి రథాలను తిలకించేందుకు ప్రజలు దారి వెంట బారులు తీరారు. హిందూ, ముస్లిం అనే భేదం లేకుండా ఎడ్ల బండ్లతో వచ్చి ఆలయ ప్రదక్షణలు చేసి మత సామరస్యానికి ప్రతీకగా నిలిచారు.



స్వామివారిని దర్శించుకున్న మంత్రులు

మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మకర సంక్రాంతి పర్వదినాన దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రవాణా, బీసీ సంక్షమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారిని పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు ఆశీర్వచనం చేయగా, ఆలయ చైర్మన్ అశోక్ ముఖర్జీ, ఈవో కిషన్ రావు వారికి శేష వస్త్రాలు సమర్పించి స్వామి వారి మెమొంటోను ప్రధానం చేశారు. అంతకుముందు త్రిశూల చౌరస్తాను ప్రారంభించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కొత్తకొండ ఆలయ అభివృద్ధిలో భాగంగా మాడ వీధులు, ఇతరత్ర అభివృద్ధి పనులకోసం రూ. 70 కోట్లు నిధులు మంజూరు చేసిన దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు కృతజ్ఞతలు తెలిపారు.

జాతరలో వైద్య సేవలు..

బ్రహ్మోత్సవాల్లో భక్తుల సౌకర్యార్థం ముల్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. భక్తులకు అందుబాటులో వైద్య సిబ్బంది ఉండి మందులు పంపిణీ చేశారు. అత్యవసర పరిస్థితి దృష్ట్యా అంబులెన్స్ ను అందుబాటులో ఉంచారు. దీంతోపాటు జాతరలో అగ్నిమాపక సిబ్బంది సైతం అందుబాటులో ఉన్నారు.

భారీ పోలీసు బందోబస్తు

జాతర లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. జూదం, మట్కా, గుట్కా, నాటుసారా లేకుండా పూర్తిస్థాయిలో పోలీసులు నియంత్రించారు. కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్ రెడ్డి తో పాటు మరో ఇద్దరు ఏసీపీలు పదిమంది సీఐలు, 25 మంది ఎస్సైలు, 350 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొని సేవలందించారు.

# పైలట్ల నోటీసులపై ఏఏఐబి అధికారుల స్పష్టీకరణ

న్యూఢిల్లీ,అహ్మదాబాద్ విమాన ప్రమాదం కేసు లో పైలట్ మేనల్లుడికి 'విమాన ప్రమాదాల దర్యాప్తు బ్యూరో' సమన్లు జారీ చేయడాన్ని ఖండిస్తూ.. పైలట్ల సమాఖ్య ఏఏఐబీకి లీగల్ నోటీసులు ఇచ్చింది. ఈ వ్యవహారంపై ఏఏఐబీ అధికారులు స్పందించారు. విమాన ప్రమాదంపై దర్యాప్తు విషయంలో తాము చట్టప్రకారంగానే వ్యవహరించామన్నారు. ప్రమాదంపై క్షుణ్ణంగా దర్యాప్తు చేస్తున్న సమయంలో వాస్తవాలను తెలుసుకోవడానికి అన్ని విషయాలపైనా దృష్టిపెట్టాల్సి ఉంటుందన్నారు. అందుకు ఎవరినైనా విచారించే అధికారం తమకు ఉందన్నారు. దర్యాప్తునకు ఉపయోగపడతారని అనిపిస్తే ఎవరినైనా, ఎన్నిసార్లు అయినా పిలుస్తామని వెల్లడించారు. ఇవి వేధింపుల కిందకు రావని స్పష్టం చేశారు. గత ఏడాది జూన్ 12న జరిగిన అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాదంలో మృతి చెందిన వారిలో కెప్టెన్ సుమిత్ సభర్వాల్, కో–పైలట్ క్లైవ్ కుందర్‌లు కూడా ఉన్నారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా సుమిత్ మేనల్లుడు కెప్టెన్ వరుణ్ ఆనంద్‌కు ఏఏఐబీ ఇటీవల సమన్లు జారీ చేసింది. జనవరి 15న విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. ఎయిరిండియాలో పైలట్‌గా పనిచేస్తున్న వరుణ్ ఆనంద్.. 'భారత పైలట్ల సమాఖ్య' లో సభ్యుడిగా ఉన్నారు. ఏఏఐబీ నోటీసులను పూర్తి అనవసరమైన చర్యగా ఎఫ్ఐపీ పేర్కొంది. ప్రమాదంతో ఎలాంటి సంబంధం లేని కెప్టెన్ వరుణ్ ఆనంద్‌ను పిలిపించడం అనవసరమని ఇది వేధింపులకు పాల్పడటం, మానసిక క్షోభకు గురిచేయడమే అవుతుందని పైలట్ల సమాఖ్య ఏఏఐబీకి పంపిన నోటీసులో పేర్కొంది.

# కొత్త హద్దులు.. కీలక నిర్ణయాలు..!!

అమరావతి:అమరావతి కేంద్రంగా కీలక నిర్ణయాలు జరుగుతున్నాయి. రెండో విడత భూ సమీకరణ సమయం లోనే సీఆర్డీఏ కొత్త ప్రణాళికలు అమలు చేస్తోంది. షెడ్యూల్ ప్రకారం నిర్మాణాల ప్రక్రియను పూర్తి చేసేందుకు కసరత్తు కొనసాగుతోంది. ఇదే సమయంలో రాజధాని మాస్టర్ ప్లాన్ విస్తరణ దిశగానూ ఆలోచన జరుగుతోంది. లాండ్ పూలింగ్ విస్తీర్ణం పెరగటంతో... దీనికి అనుగుణంగా మాస్టర్ ప్లాన్ లో అవసరమని గుర్తించారు. దీంతో, కొత్త హద్దులు ఖరారు చేస్తూ మాస్టర్ ప్లాన్ విస్తరణ కోసం సీఆర్డీఏ ప్రతిపాదనలు సిద్ధం చేస్తోందని సమాచారం.అమరావతిలో రెండో విడత లాండ్ పూలింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. ఇందుకు అనుగుణంగా సీఆర్డీఏ రాజధానికి కొత్త హద్దుల మేరకు మాస్టర్ ప్లాన్ విస్తరణకు నిర్ణయించారని సమాచారం. ఈ మేరకు తుది కసరత్తు చేస్తున్నారు. రెండో విడత భూ సమీకరణ ప్రక్రియ ముగిసిన తరువాత మాస్టర్ ప్లాన్ విస్తరణకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభించనున్నారు. 189 కిలోమీటర్ల పొడవైన అమరావతి ఔటర్ రింగురోడ్డుకు ఇప్పటికే గెజిట్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. దీనికితోడు ఇన్నర్ రింగురోడ్డు నిర్మాణమూ చేపట్టనున్నారు. అయితే ప్రస్తుతం ఉన్న మాస్టర్ ప్లానును విస్తరించాలనే ఆలోచనలో ఉన్నట్లు ఇటీవల మంత్రి నారాయణ వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న రోడ్లను రెండోదశ పూలింగు ప్రాంతానికి విస్తరించనున్నామని, వీటిని ఔటర్ రింగుకు అన్నివైపులా కలిపేలా ప్లానింగు ఉందని వెల్లడించారు.తాజా ప్రతిపాదనల మేరకు తూర్పున 16వ నెంబరు జాతీయ రహదారి హద్దుగా దక్షణం, పడమర ప్రాంతంలో ఔటర్ రింగురోడ్డు, ఉత్తరాన కృష్ణానది ప్రాంతం మధ్యలో పూర్తిగా ప్లానింగు ఏర్పాటు చేస్తామని మంత్రి వెల్లడించారు. దాదాపుగా సిఆర్‌డిఏ రీజియన్ ప్రాంతం మొత్తం సమగ్ర ప్లానింగు పరిధిలోకి వస్తుంది. ప్రస్తుతం సిఆర్‌డిఏ ప్రాంతం సుమారు 8352 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంది. అంటే సుమారుగా 20.88 లక్షల ఎకరాలకు విస్తరించి ఉంది. దీనిలో కనీసం మూడు లక్షల ఎకరాల పరిధిలోకి రాజధాని ప్లానింగు ఏరియా పెరుగుతుందనేది అంచనాగా వేస్తున్నారు. ప్రస్తుతం 16వ నెంబరు జాతీయ రహదారికి ఈ3, ఈ5 రోడ్లను కలపనున్నారు. ఈ3 రోడ్డును రెండోదశ ల్యాండ్ పూలింగు పరిధి వరకు తీసుకెళ్లే విధంగ ఆలోచన చేస్తున్నారు. సమీకరణ ప్రాంతంలో రోడ్ కనెక్టివిటీ పూర్తి చేసిన తరువాత అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పనిలో పనిగా మొత్తం ఔటర్‌రింగురోడ్డుకూ అనుసంధానం చేయాలని భావిస్తున్నారు.

సచివాలయాల్లో కీలక మార్పులు, కొత్త బాధ్యతలు – ఆర్డినెన్స్ జారీ..!!

కాగా, ఇన్నర్ రింగురోడ్డు, ఔటర్ రింగురోడ్డుకు మధ్యలో అభివృద్ధికి అవసరమైన ప్లానింగు చేయాలని తొలి మాస్టర్ ప్లాన్ ఖరారు వేళ నిర్ణయించారు. రాజధాని చుట్టుపక్కల ఏడు ప్రాంతాల ను పారిశ్రామిక, వాణిజ్య కేంద్రాలుగా గుర్తించారు. రింగురోడ్లను కూడా వాటిని దృష్టిలో పెట్టుకునే ప్లాను చేశారు. గుడివాడ, గుంటూరు, తెనాలి, సత్తెనపల్లి, కంచికచర్ల, కంకిపాడు, ఉయ్యూరు పరిసరాల్లో ప్రత్యేక అభివృద్ధి కేంద్రాలనూ ఏర్పాటు చేయాలనేది అప్పటి ప్రతిపాదన. ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల కేంద్రంగా గుడివాడ, ఆహ్లాద, పర్యాటక ప్రాంతంగా తెనాలి, లాజిస్టిక్ కేంద్రంగా గన్నవరం ప్రాంతాలను అప్పట్లో ప్రతిపాదించారు. ప్రస్తుతం మాస్టర్‌ప్లాను రూపొందించాలనే మంత్రి ప్రకటన నేపథ్యంలో ఇప్పుడు కొత్తగా ఎలాంటి ప్రతిపాదనలు చేస్తారనేది ఆసక్తి కరంగా మారుతోంది.

# వైట్‌హౌజ్‌లో ట్రంప్‌తో కొరినా మచాడో భేటీ

వాషింగ్టన్, వెనుజువెలా ప్రతిపక్ష నాయకురాలు మారియా కొరినా మచాడో గురువారం వైట్ హౌజ్‌లో అధ్యక్షుడు ట్రంప్‌ని కలిశారు. ఈ సందర్భంగా తన నోబెల్ శాంతి బహుమతి పురస్కారాన్ని ట్రంప్ నకు అందజేశారు. సమావేశం అనంతరం ఈ విషయాన్ని మచాడో స్వయంగా మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా మచాడో మాట్లాడుతూ.. 'చరిత్రలో రెండు వందల ఏళ్ల తర్వాత, బొలివర్ వారసులు వాషింగ్టన్ వారసుడికి ఒక పతకాన్ని తిరిగి ఇస్తున్నా.. ఇది మన స్వేచ్ఛ పట్ల ఆయన ప్రత్యేక నిబద్ధతకు గుర్తింపుగా నా నోబెల్ శాంతి బహుమతిని ట్రంప్ నకు అందజేస్తున్నా' అని వ్యాఖ్యానించారు. వెనుజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్యను ఇటీవల అమెరికా సైనిక దళాలు అదుపులోకి తీసుకున్న కొన్ని రోజులకే ఈ పరిణామాలు చోటు చేసుకోవడం ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. మచాడోతో భేటీ అనంతరం ట్రంప్ స్పందిస్తూ.. 'మారియా కొరినా మచాడోను కలవడం నాకు ఎంతో సంతోషంగా ఉంది. ఆమె ఎన్నో కష్టనష్టాలను ఎదిరించి నిలిచిన గొప్ప మహిళ, ఇన్నాళ్ళు ప్రపంచ శాంతి కోసం నేను చేసిన కృషిని గుర్తించి ఆమె తన నోబెల్ పురస్కారాన్ని నాకు బహుమతిగా ఇచ్చారు.. థ్యాంక్యూ మరియా.. అంటూ తన ట్రూత్ సోషల్ వేదికగా తెలిపారు. గత ఏడాది అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ తనకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని.. దానికి తాను పూర్తి అర్హుడని నానా హంగామా చేశారు. కానీ, నోబెల్ బహుమతి మాత్రం ట్రంప్‌నకు దక్కలేదు. 2025 లో నోబెల్ బహుమతి వెనుజువెలా ప్రతిపక్ష నేత కొరినా మచాడోకి దక్కింది.

## బాలుడికి పురాతన నాణెలు లభ్యం

బెంగళూరు, కర్ణాటకలోని గడగ్ జిల్లా లక్కుండి గ్రామంలో ఇటీవల ఓ బాలుడికి పురాతన కాలం నాటి బంగారు నాణెళిలు లభించడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. గ్రామంలోని కోటె వీరభద్రేశ్వర స్వామి ఆలయ పరిసరాల్లో తవ్వకాలు జరిపేందుకు పురావస్తు శాఖ రంగంలోకి దిగింది. రాష్ట్ర పర్యాటక శాఖ, లక్కుండి వారసత్వ పరిరక్షణ సంస్థ, జిల్లా అధికారుల సారథ్యంలో శుక్రవారం తవ్వకాలు ప్రారంభమయ్యాయి. మధ్య యుగాల నాటి నుంచీ అనేక రాజవంశాలు పాలించిన లక్కుండి చరిత్ర ఎంతో గొప్పదని చరిత్రకారులు చెబుతున్నారు. ఈ ప్రాంతాన్ని చాళుక్యులు, రాష్ట్రకూటులు, విజయనగర రాజులు, ఇతర వంశాల పాలకులు అనేక మంది పరిపాలించారు. అప్పట్లో బంగారు నాణెళిల ముద్రణకు లక్కుండి కేంద్రంగా ఉండేదని చరిత్రకారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన ఓ బాలుడికి దాదాపు 470 గ్రాముల బరువున్న బంగారు నాణెళిలు లభించాయి. వీరభద్రేశ్వర ఆలయ సమీపంలోని ఓ ఇంటి నిర్మాణం కోసం తవ్వకాలు జరుపుతున్న సమయంలో నాణెళిలున్న పాత్ర బాలుడి కంట పడింది. దీంతో చిన్నారి స్థానిక అధికారులకు సమాచారం అందించాడు. ఈ నేపథ్యంలోనే అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ ప్రాంతంలో తవ్వకాలు జరిపితే అనేక వస్తువులు బయటపడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. లక్కుండి ఘన చరిత్ర ఆనవాళ్లు అనేకం వెలుగులోకి వస్తాయని అంటున్నారు. అధికారులు ఇప్పటికే జేసీబీలు, ట్రక్కులను ఆలయ పరిసరాలకు తరలించారు. అక్కడ ఓ 10 చదరపు మీటర్ల విస్తీర్ణంలో తవ్వకాలు జరుపుతామని తెలిపారు. కాగా, 2024లో గ్రామంలో జరిపిన తవ్వకాల్లో చారిత్రక ప్రాధాన్యత కలిగిన అనేక వస్తువులు బయటపడ్డాయి. తాజాగా నాణెళిలు కూడా లభించడంతో మరోసారి లక్కుండి పేరు రాష్ట్రవ్యాప్తంగా మార్మోగిపోతోంది. ప్రస్తుతం జరుపుతున్న తవ్వకాలకు చారిత్రక ప్రాధాన్యం అత్యధికమని నిపుణులు చెబుతున్నారు. కర్ణాటక చరిత్ర గురించి చెప్పే శాసనాలు, కళాకృతులు, నగలు బయటపడే

# భూభారతి అక్రమార్కుల అరెస్ట్..

నయీంనగర్(హన్మకొండ),రాష్ట్రంలో సంచలనం సృష్టించిన జనగామ, యాదాద్రి జిల్లాల్లో భూ భారతి రిజిస్ట్రేషన్లలో అవినీతి అక్రమాల కేసును పోలీసులు ఛేదించారు. రిజిస్ట్రేషన్లకు సంబంధించి రూ.3.90 కోట్ల కుంభకోణంలో ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టిన ముఠాలోని15 మందిని జనగామ పోలీసులు అరెస్టు చేయగా, మరో తొమ్మిది మంది పరారీలో ఉన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ హనుమకొండలోని కార్యాలయంలో వెల్లడించారు. సీపీ కథనం ప్రకారం.. ప్రధాన నిందితులు పసునూరి బసవరాజు, జెల్లా పాండు యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో ఆన్‌లైన్ సర్వీస్‌సెంటర్ నిర్వహిస్తున్నారు.గణేశ్ అనే వ్యక్తి ఆన్‌లైన్ సెంటర్లతో పరిచయం చేసుకొని ప్రభుత్వానికి చెల్లించాల్సిన మొత్తాన్ని ఎన్‌ఆర్‌ఐ ఖాతా పే చేస్తానని చెప్పి రైతుల నుంచి డబ్బులు వసూలు చేసి, వాటిని ఆన్‌లైన్ సర్వీస్ వ్యక్తులు, మధ్యవర్తులకు కమీషన్ చొప్పున అందజేస్తూ, ఈ చలాన్లు ప్రధాన నిందితుడికి పంపేవాడు. వచ్చిన చలాన్లను బసవరాజు భూ భారతి వెబ్‌సైట్‌లో ఇన్‌స్పెక్ట్ ఎడిట్ అప్లికేషన్‌ను ఉపయోగించి రుసుమును తగ్గించి చలాన్‌ను మొబైల్ ద్వారా ఎడిట్ చేసి తిరిగి రైతులకు పంపేవాడు. ఈ క్రమంలోనే నిందితులు మొబైల్ అప్లికేషన్‌తో ప్రభుత్వానికి పే చేసే రుసుమును రసీదులో కంటే తక్కువగా చెల్లించేవారు. తర్వాత ఆ నకిలీ చలాన్లనే మధ్యవర్తుల ద్వారా ఎంఆర్‌వో, రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సమర్పించి, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ మోసాలకు పాల్పడేవారు. ఇలా ప్రధాననిందితులిద్దరు జనగామ, యాద్రాద్రి జిల్లాల్లో 1,080 పత్రాలకు సంబంధించిన లావాదేవిల్లో మోసాలకు పాల్పడగా 22 కేసులు నమోదైనట్టు సీపీ వెల్లడించారు.

నిందితుల వివరాలు



కేసులో మొత్తంగా 15 మందిని అరెస్ట్ చేసినట్టు సీపీ తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో యాదాద్రి జిల్లాకు చెందిన గణేశ్‌కుమార్, కిషన్‌రెడ్డి, దశరథ, భానుప్రసాద్, శ్రీనాథ్, శివకుమార్, అమంగల్, నాగరాజు, కరుణాకర్, కమల్ సహా జనగామ జిల్లాకు చెందిన శ్రీనాథ్, యెనగందుల వెంకటేశ్, కోదూరి శ్రావణ్, కొలిపాక సతీశ్‌కుమార్, తదూరి రంజిత్ కుమార్ ఉన్నట్టు సీపీ తెలిపారు. ఈ సందర్భంగా వారి నుంచి రూ.63.19 లక్షల నగదు, బ్యాంకులో రూ.లక్ష, సుమారు కోటి రూపాయల విలువైన ఆస్తిపత్రాలు, కారు, రెండు ల్యాప్‌టాప్‌లు, ఐదు డెస్‌టాప్‌లు, 17 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు సీపీ వివరించారు.

### అన్నను చంపిన తమ్ముడు

హైదరాబాద్,పండగ పూట హైదరాబాద్ నాచారంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. మద్యం సేవించే క్రమంలో జరిగిన చిన్న గొడవ అన్నదమ్ముల మధ్య ఘర్షణకు దారి తీసింది. మద్యం గ్లాస్ విషయంలో మొదలైన వాగ్వాదం తీవ్రస్థాయికి చేరడంతో తమ్ముడు అన్నపై దాడికి పాల్పడ్డాడు. అంతటితో ఆగకుండా కోపోద్రిక్తుడైన తమ్ముడు అన్నను మూడో అంతస్తుపై నుంచి తోసేయడంతో

## మరోమారు పాక్ కవ్వింపు చర్యలు

న్యూఢిల్లీ,ఓ వైపు భారత్‌తో స్నేహ సంబంధాలు కొనసాగిస్తాం అంటూనే.. పాకిస్థాన్ మరోవైపు కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. గురువారం రాత్రి జమ్మూ కాశ్మీర్‌లోని పూంచ్ సెక్టార్‌లో నియంత్రణ రేఖ వెంబడి రెండు పాక్ డ్రోన్లు సంచరించినట్లు రక్షణ వర్గాలు వెల్లడించాయి. డ్రోన్ల కదలికలు చూసిన వెంటనే భారత సైన్యం స్పందించి యాంటీ-డ్రోన్ ఆపరేషన్ చేపట్టడంతో అవి వెనుదిరిగాయి. ఈ వారంలోనే ఇలా జరగడం మూడోసారి అంటున్నారు. పాకిస్థాన్‌కు భారత్ ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది హెచ్చరికలు జారీ చేసిన కొద్ది గంటల్లోనే ఈ ఘటన చోటు చేసుకోవడం గమనార్హం. గణతంత్ర దినోత్సవం వేడుకల నేపథ్యంలో సరిహద్దుల్లో భద్రతా దళాలు పహారా కాస్తున్నాయి. డ్రోన్ల కదలికల తర్వాత ఆ ప్రాంతంలో హై అలర్ట్ ప్రకటించి, భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. మంగళవారం రాత్రి, రాజౌరి జిల్లాలోని నియంత్రణ రేఖ (ఒక్షఅ) దాటి భారత భూభాగంలోకి వచ్చిన అనుమానిత పాక్ డ్రోన్లను అడ్డగించడానికి ఆర్మీ సిబ్బంది కాల్పులు జరిపారు.

## పుంగనూరు టీడీపీ ఇంచార్జ్‌కి వచ్చిన కష్టమేంటి?

అమరావతి, స్టేట్ మొత్తం కూటమిదే హవా. ఆ నియోజకవర్గంలో మాత్రం ఆ వైసీపీ సీనియర్ లీడర్‌దే జోరు. అలాంటి బలమైన నేతతో ఢీ అంటే ఢీ అంటున్న..ఆ టీడీపీ లీడర్.. ఇంటా, బయట అందరికీ టార్గెట్ అయిపోయారట. ఆయన దూకుడుకు కళ్లెం వేసేందుకు సొంత పార్టీ నేతలే బ్రేకులు వేస్తున్నారట. దీంతో అప్పుడు ప్రతిపక్షంలో..ఇప్పుడు అధికార పార్టీలో ఉండి కూడా సేమ్ సీన్‌ను ఫేస్ చేస్తున్నారట ఆ నేత. ఇంతకు ఎవరా లీడర్? ఆయనకు వచ్చిన కష్టమేంటి?

చల్లా బాబు దూకుడుకు బ్రేకులు వేస్తున్నదెవరు?

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పుంగనూరు నియోజకవర్గ పాలిటిక్స్ సమ్‌థింగ్ స్పెషల్. వైసీపీ మాజీ మంత్రి, ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఫ్యామిలీదే అక్కడ హవా. 2009 నుంచి పుంగనూరులో తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్న పెద్దిరెడ్డి దూకుడుకు బ్రేకులు వేసేందుకు టీడీపీ అనేక ఎత్తులు వేసింది. 2024 ఎన్నికల్లో స్పెషల్‌గా టార్గెట్ చేసినా, ఆయన విజయాన్ని మాత్రం టీడీపీ ఆపలేకపోయిందన్న చర్చ ఉంది. గత ఎలక్షన్స్‌లో పెద్దిరెడ్డి చేతిలో టీడీపీ నేత చల్లా బాబు ఓటమి పాలయ్యారు. ఎమ్మెల్యేగా ఓడినా..రాష్ట్రంలో అధికారం రావడంతో ఇక తిరుగుండదని భావించారట చల్లా బాబు.


అధికారంలోకి వచ్చినా దక్కని ప్రయారిటీ..

ఎన్నో సవాళ్లను ఫేస్ చేస్తూ దాడులు, కేసుల పాలయ్యాయని వాపోతున్నారట. 2023లో టీడీపీ అధినేత చంద్రబాబు పుంగనూరు పర్యటనలో జరిగిన విధ్వంసంలో నమోదైన నాలుగు కేసుల్లో నిందితుడిగా చల్లా బాబు కడప సెంట్రల్ జైలుకు వెళ్లాల్సి వచ్చింది. కొంతకాలం అజ్ఞాతంలో ఉండాల్సిన పరిస్థితిని కూడా ఆయన ఎదుర్కొన్నారట. 2024 ఎన్నికల్లో పుంగనూరు టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి పెద్దిరెడ్డిని ఓడించలేక పోయినా..ఆయన మెజారిటీని భారీగా తగ్గించారు చల్లా బాబు. ఇలా ప్రతిపక్షంలో ప్రత్యర్థి పార్టీకి టార్గెట్‌గా మారిన చల్లాబాబుకు ఇప్పుడు అధికారం వచ్చాక ప్రయారిటీ దక్కట్లేదట. పవర్‌లోకి వచ్చిన తొలినాళ్లలో కాస్త దూకుడు ప్రదర్శించి హంగామా చేసినా ఇప్పుడు స్పీడు తగ్గించాల్సి వస్తోందట. ఇందుకు ప్రధాన కారణం సొంత పార్టీలోనే కొందరు ఆయన హడావుడికి అడ్డంకులు సృష్టిస్తున్నారట.

అధిష్టానానికి ఫిర్యాదులు వెల్లువ..

పుంగనూరు టీడీపీ ఇంచార్జ్‌గా భారీ కాన్వాయ్‌తో..చల్లా బాబు చేస్తున్న హడావుడిని కొందరు సొంత పార్టీ నేతలే డైజెస్ట్ చేసుకోలేకపోతున్నారట. టీడీపీలోనే ఒక వర్గం ఆయన్ను టార్గెట్ చేసి..హైకమాండ్ దగ్గర ఆయన పరపతిని తగ్గించే ప్రయత్నం చేస్తోందట. ఇది చల్లా బాబుకు ఇబ్బందిగా మారిందంటున్నారు. ఆయన అనుచరుల హడావుడిపైనా అధిష్టానానికి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో చల్లా బాబు పవర్‌కు బ్రేకులు వేసినట్లైందట. దీంతో చల్లాబాబు కూడా దూకుడును తగ్గించారట. జిల్లా ఇంచార్జ్ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డితో సన్నిహితంగా ఉంటూ పుంగనూరులో మరింత బలపడాలనుకుంటున్న చల్లాబాబుకు సొంత పార్టీ నేతల పెడుతున్న ఇబ్బందులు హెడెక్‌గా మారాయట.నామినేటెడ్ పదవుల విషయంలో కూడా ఆయన వర్గానికి ఇంపార్టెన్స్ దక్కకపోవడంతో చల్లాబాబు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారట.

# ఇదే రాజధాని.. అమరావతికి చట్టబద్ధత.. చంద్రబాబు మాస్టర్ ప్లాన్



అమరావతి,ఏపీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు సీఎం చంద్రబాబు. తాము నిర్దేశించుకున్న కీలక సూత్రాల అమలుకు.. కేంద్రం కొత్తగా తెచ్చిన వీబీ జీ రామ్ జీ స్కీమ్ ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ఇక.. రాష్ట్రంలోని రైతులకు వారి భూములపై సమగ్ర హక్కులు, భద్రత కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు సీఎం. అమరావతి దేవతల రాజధాని అని.. వేంకటేశ్వరస్వామి దీవెనలతో అమరావతి అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షంచారు. ఎంతమంది బాధపడినా అమరావతి డైనమిక్ సిటీ అని చెప్పారు. ఈ వారం జరిగిన క్యాబినెట్ మీటింగ్.. కీలక నిర్ణయాలకు వేదికగా నిలిచింది.

జనవరి 10 పేదలకు ఉపాధి

పేదలకు ఉపాధి కల్పించడంతో పాటు గ్రామాల్లో ఆస్తులను సృష్టించేలా.. వికసిత్ భారత్ జీ రామ్ జీ పథకాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. క్యాంపు ఆఫీసులో దీనిపై సమీక్ష నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం గత డిసెంబర్‌లో.. మహాత్మగాంధీ ఉపాధి హామీ పథకం స్థానంలో తెచ్చిన వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అజీవికా మిషన్- వీబీ జీ రామ్ జీ పథకంపై.. ప్రజలకు, లబ్ధిదారులకు వివరించేలా కార్యాచరణ సిద్ధం చేయాలని సీఎం చంద్రబాబు సూచించారు. రాష్ట్రాన్ని 10 సూత్రాల ఆధారంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుని ఆ దిశగా పని చేస్తోందన్నారు. ఇప్పుడు నిర్దేశించుకున్న 10 సూత్రాల అమలుకు జీ-రామ్-జీ స్కీం ఉపయోగపడుతుందని సీఎం అభిప్రాయపడ్డారు.

జనవరి 9 మీ భూమి ఉ మీ హక్కు

భూమితో రైతులకు భావోద్వేగ బంధం ఉంటుందని, ప్రాణాలు పోయినా దానిని వదులుకోడానికి సిద్ధపడరని సీఎం చంద్రబాబు అన్నారు. భూములపై సమగ్ర హక్కులు, భద్రత కల్పించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాయవరంలో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. కంటిపూడి సత్యసాయిబాబా అనే రైతుకు.. సీఎం స్వయంగా పట్టాదారు పాసుపుస్తకాన్ని అందించారు. పాసుపుస్తకంలో ముద్రించిన క్యూఆర్ కోడ్‌ను సెల్ ఫోన్‌లో స్కాన్ చేయించి.. మ్యాప్ ద్వారా పొలం దగ్గరకు వెళ్లారు. ఎవరి ఫోటోలు లేకుండా.. రాజముద్రతో తమకు పట్టాదారు పుస్తకం ఇవ్వడం సంతోషంగా ఉందని రైతు సత్యసాయిబాబా సీఎంతో అన్నారు. పట్టాదారు పాసు పుస్తకాలను ఎవరూ ట్యాంపర్ చేయలేని విధంగా రూపొందించామని సీఎం ప్రజా వేదికపై చెప్పారు. ప్రతి నెలా 2 నుంచి 9 వరకు.. గ్రామసభలు నిర్వహించి భూముల వివరాలన్నీ చదివి వినిపిస్తారని, భూయజమానులు సంతృప్తి చెందితేనే ఈ-కేవైసీ చేసి, 9న పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తారని చెప్పారు సీఎం చంద్రబాబు.

జనవరి 8 టూరిజం గేమ్ ఛేంజర్

సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఈ వారం జరిగిన క్యాబినెట్ మీటింగ్.. కీలక నిర్ణయాలకు వేదికైంది. అమరావతిలోని కృష్ణా నది తీరంలో ప్రతిష్ఠాత్మక మెరీనా ప్రాజెక్టుతో పాటు, వేల కోట్ల విలువైన పెట్టుబడులను ఆకర్షించే ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. పర్యాటక రంగాన్ని ఏపీ ఆర్థిక వ్యవస్థకు గేమ్ ఛేంజర్‌గా మార్చి, యువతకు భారీగా ఉపాధి కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలతో.. పరిశ్రమలు, పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్, ఇంధన రంగాల్లో 14 కొత్త సంస్థలు ఏర్పాటవుతాయి. రాష్ట్రంలో సరకు రవాణా రంగాన్ని వ్యవస్థీకృతం చేసేందుకు ఏపీ లాజిస్టిక్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు.. స్కూల్ కిట్ల పంపిణీ కోసం 944 కోట్లకు పరిపాలనా అనుమతులు ఇచ్చారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలో కొత్తగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయనున్నారు. జల్ జీవన్ మిషన్ కింద 5 వేల కోట్ల రుణానికి.. ప్రభుత్వ గ్యారెంటీ ఇచ్చేందుకు క్యాబినెట్ అంగీకరించింది. ఎక్సైజ్ విధానంలో భాగంగా బార్లపై ఉన్న అదనపు రిటైల్ ఎక్సైజ్ పన్ను ఉపసంహరణ, కార్పొరేషన్ల పరిధిలో మైక్రో బ్రూవరీల ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని నిర్ణయించారు. డాక్టర్ సుధాకర్ కుటుంబానికి ఆర్థికంగా అండగా ఉండాలని క్యాబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. కోటి రూపాయల ఆర్థిక సాయంతో పాటు.. ఆయన కుమారుడు లలిత్ ప్రసాద్‌కు ప్రమోషన్ ఇచ్చి గ్రూప్-2 స్థాయి ఉద్యోగం కల్పించాలని నిర్ణయించింది. సంప్రదాయేతర ఇంధన, విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుతో పాటు వివిధ సంస్థల భూకేటాయింపులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

జనవరి 8 అమరావతి ఉ ఆవకాయ్

తెలుగు సినిమా, సాంస్కృతిక, కళా, సాహిత్య మేళవింపుగా విజయవాడలో నిర్వహించిన అమరావతి ఉ ఆవకాయ్ ఉత్సవాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యారు. ఉత్సవాల్లో భాగంగా పున్నమిఘాట్‌లో ఏర్పాటు చేసిన ప్రధాన వేదికపై సాహిత్య చర్చలు, కవితా పఠనం, సంగీతం, నృత్యం, నాటకాలు, సదస్సులు నిర్వహించారు. కృష్ణా నదిలో నూతనంగా ఏర్పాటు చేసిన హౌస్ బోట్లను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఉత్సవాలను వీక్షించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అమరావతి దేవతల రాజధాని అని.. వేంకటేశ్వరస్వామి దీవెనలతో అమరావతి అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఎంతమంది.. ఎంత బాధపడినా అమరావతి బెస్ట్ సిటీ.. డైనమిక్ సిటీ అని చెప్పారు. కృష్ణా నది దగ్గర.. గంట పాటు గడిపితే.. మెడిటేషన్ కూడా అవసరం లేదన్నారు చంద్రబాబు. అమరావతి గ్రీన్‌సిటీ అని, విజయవాడ క్లీనెస్ట్ సిటీ అని సీఎం చెప్పారు.

జనవరి 8 సన్‌రైజ్ ఏపీ

యూరోపియన్ యూనియన్ భారత రాయబారి హెర్వే డెల్ఫీతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. క్లీన్ ఎనర్జీ, మౌలిక సదుపాయాలు, వాణిజ్యం అంశాలపై చర్చించారు. ఈయూ, భారత్ మధ్య స్నేహ సంబంధాలను బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపైనా చర్చించారు. సన్ రైజ్ ఆంధ్రప్రదేశ్ విజన్ 2029లో భాగంగా తీసుకోబోతున్న.. బ్లూ వ్యాలీ ఇనీషియేటివ్, ఏపీ అనుసరిస్తున్న కీలక మిషన్‌లు, పారిశ్రామిక కారిడార్లు లాంటి అంశాలపై కూడా విస్తృతంగా చర్చలు జరిపారు.

ఉత్తరాంధ్ర రీజియన్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ఆస్కారం లేని విధంగా కొత్త పాస్ పుస్తకాలు ఉన్నాయని చంద్రబాబు తెలిపారు. ఉత్తరాంధ్ర రీజియన్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు సీఎం.ఏపీ రాజధానిగా అమరావతిని చట్టబద్ధం చేయాలని.. కేంద్రాన్ని కోరారు సీఎం చంద్రబాబు. విభజన చట్టంలో అమరావతిని చేరుస్తూ.. పార్లమెంట్‌లో బిల్లుని ఆమోదించాలని అమిత్ షాకు విజ్ఞప్తి చేశారు. ఇక.. వైసీపీ పాలనలో ఏపీ కోల్పోయిన బ్రాండ్ ఇమేజ్‌ను కూటమి ప్రభుత్వం తిరిగి తెచ్చిందన్నారు సీఎం. గతేడాది అంతా కలిసి పనిచేయడంతో పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. భూ రికార్డుల్లో గతంలో జరిగిన తప్పులను సరిదిద్దాలని, రికార్డులను తారుమారు చేయడానికి

జనవరి 7 అమిత్ షాతో సీఎం

అమరావతికి చట్టబద్ధత కోసం సీఎం చంద్రబాబు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఈ వారం ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిశారు. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని చట్టబద్ధం చేయాలని కోరారు. విభజన చట్టంలో అమరావతిని చేర్చాలని.. దీనికోసం పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు. అమరావతికి చట్టబద్ధత కల్పిస్తే రాష్ట్ర అభివృద్ధి వేగవంతం అవుతుందని, ప్రజల ఆశలు నెరవేరుతాయని చంద్రబాబు అన్నారు. పెట్టుబడులు పెట్టేవారికి కూడా భరోసా ఉంటుందని తెలిపారు. కేంద్రం కూడా అమరావతి విషయంలో సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా.. గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా నిష్పత్తిలో.. ఏపీకి వెసులుబాట్లు కల్పించాలని కోరారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని వివరించి.. ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టబోయే కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని అమిత్‌షాను అభ్యర్థించారు.

కేంద్ర సహకారం పెంచాలని అమిత్ షాకు చంద్రబాబు విజ్ఞప్తి

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలలో రాష్ట్రానికి రావాల్సిన వాటాను పెంచాలని.. అమిత్ షాని కోరారు చంద్రబాబు. గృహ నిర్మాణం, రహదారులు, రైల్వే ప్రాజెక్టుల వంటి కీలక రంగాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పోలవరం, అమరావతి ప్రాజెక్టులను అనుకున్న సమయానికి పూర్తి చేయడానికి కేంద్రం చేయూతనివ్వాలన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడానికి, రెవెన్యూ లోటును పూడ్చడానికి కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు. ఏపీలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. రాయలసీమను హార్టికల్చర్ కేంద్రంగా తీర్చిదిద్దడానికి బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించాలన్నారు. గిరిజన ప్రాంతమైన రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటు చేశామని.. ఆ ప్రాంత అభివృద్ధికి హోంశాఖ నుంచి తగినన్ని నిధులు ఇవ్వాలని చంద్రబాబు కోరారు.

జనవరి 7 పోలవరం ప్రోగ్రెస్

పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిని ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ వారం ఏరియల్ విజిట్ ద్వారా పరిశీలించారు. వ్యూ పాయింట్ నుంచి స్పిల్ వే సహా మొత్తం ప్రాజెక్టును, డయాఫ్రమ్ వాల్ సహా ఇతర నిర్మాణాలను వీక్షంచారు. ప్రాజెక్టు సైట్ దగ్గరే.. సీఎం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. పోలవరం ప్రాజెక్టులో 87 శాతం మేర సివిల్ పనులు పూర్తయ్యాయని, గడువులోగా మిగతా పనులు పూర్తి చేయాలని.. సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్వాసితుల పునరావాసం, ఆర్ అండ్ ఆర్ పనులపై పూర్తి స్థాయిలో ఫోకస్ పెట్టాలని సూచించారు. పోలవరం ఎడమ కాలువ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, కుడికాలువ ద్వారా కొల్లేరు ప్రాంతాలకు కూడా నీరు వెళ్లేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు.జనవరి 6 రైతన్నకు భరోసారాష్ట్ర రైతుల్లో నమ్మకం, భరోసా కల్గించేలా కొత్త పాస్ పుస్తకాలను అందచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఇప్పటికే మొదలైన కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీపై ఈ వారం సమీక్ష నిర్వహించారు. భూ రికార్డుల్లో గతంలో జరిగిన తప్పులను సరిదిద్దాలని, రికార్డులను తారుమారు చేయడానికి ఆస్కారం లేని విధంగా కొత్త పాస్ పుస్తకాలు ఉన్నాయని సీఎం అన్నారు. ఇప్పటి వరకు 6 లక్షలకు పైగా పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా.. ఏపీలో స్వయం సహాయక సంఘాలు తయారుచేస్తున్న ఉత్పత్తులకు బ్రాండింగ్, మార్కెటింగ్ అంశాలపైనా సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ౹ాౣ+ లు తయారు చేస్తున్న 23 వేలకు పైగా ఉత్పత్తులకు.. జాతీయ, అంతర్జాతీయ స్థాయి బ్రాండింగ్, మార్కెటింగ్ జరగాలని దిశానిర్దేశం చేశారు. మహిళా సంఘాలు, మైక్రో ఎంట్రప్రెన్యూర్స్‌కు ఆర్థిక సుస్థిరత వచ్చేలా ఉత్పత్తులను వ్యవస్థీకృతం చేయాలని సూచించారు.

జనవరి 6 మెరీనా వాటర్ ఫ్రంట్

రాజధాని అమరావతి ప్రాంతంలోని కృష్ణా నది తీరాన్ని.. మెరీనా వాటర్ ఫ్రంట్‌గా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలకు.. సీఎం అధ్యక్షతన జరిగిన సీఆర్డీఏ అథరిటీ సమావేశం ఆమోదం తెలిపింది. మెరీనా వాటర్ ఫ్రంట్‌లో భాగంగా జెట్టీలు, టూరిజం లీజర్ బోట్లు, ఫుడ్ ప్లాజాలు, ల్యాండ్ స్కేప్ పనులను పీపీపీ విధానంలో చేపట్టేందుకు టెండర్లు పిలవాలని సీఎం సూచించారు. వాటర్ ఫ్రంట్ రూపకల్పనకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. రివర్ ఫ్రంట్‌తో పాటు వాటర్ స్పోర్ట్స్ యాక్టివిటీస్ ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. బ్లూ ఉ గ్రీన్ సిటీగా అమరావతిని తీర్చిదిద్దే క్రమంలో అంతర్గత కాలువల నిర్మాణం, సుందరీకరణ పనులు జరగాలన్నారు. ప్రకాశం బ్యారేజీ ఎగువన నిర్మించే కొత్త బ్యారేజ్‌తో.. రాజధానికి నీటి వనరులు సమకూరతాయని వివరించారు. కృష్ణానదికి ఇరు వైపులా అద్భుతమైన వాటర్ ఫ్రంట్ అభివృద్ధి చేసుకోవచ్చని సూచించారు.

జనవరి 6 ఏపీ బ్రాండ్

వైసీపీ పాలనలో.. ఏపీ కోల్పోయిన బ్రాండ్ ఇమేజ్‌ను కూటమి ప్రభుత్వం తిరిగి తెచ్చిందని మరోసారి స్పష్టం చేశారు సీఎం చంద్రబాబు. 2025లో అంతా కలిసి పనిచేయడంతో.. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చాయన్నారు. ఈ వారం సచివాలయంలో సీఎం అధ్యక్షతన.. రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశం జరిగింది. పరిశ్రమలు, పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్, ఇంధన రంగాలకు చెందిన 19 వేల 391 కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలకు ౹ాఖూదీ ఆమోదం తెలిపింది. వీటి ద్వారా ఏర్పాటయ్యే పరిశ్రమలతో దాదాపు 12 వేల మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. గత 13 సమావేశాల్లో 8 లక్షల 55 వేల కోట్ల పెట్టుబడులకు, 8 లక్షల 23 వేల ఉద్యోగ అవకాశాలకు ఆమోదం తెలిపారు. ఇదే ఉత్సాహంతో.. ఈ ఏడాది కూడా పనిచేయాలన్నారు సీఎం. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్‌లో ఫలితాలు తీసుకొచ్చే లక్ష్యంతో పనిచేయాలని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఐటీ ఇన్ఫ్రా కనెక్ట్ పోర్టల్‌ని కూడా సీఎం చంద్రబాబు ప్రారంభించారు.

జనవరి 5 తెలుగు వెలుగు

గుంటూరులో జరిగిన 3వ ప్రపంచ తెలుగు మహాసభలకు ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యారు. ఈ కార్యక్రమం స్మారకంగా జారీ చేసిన తపాలా శాఖ స్పెషల్ కవర్‌ను సీఎం ఆవిష్కరించారు. తెలుగు మహాసభలకు పెద్ద ఎత్తున జనం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మాతృభాషకు ఇచ్చే గౌరవ వందనమే ప్రపంచ తెలుగు మహాసభలని చెప్పారు. ప్రపంచంలో వందల భాషలున్నా, 6 భాషలకు మాత్రమే ప్రాచీన హోదా లభించిందని, అందులో తెలుగు ఉండటం గర్వకారణమని సీఎం చంద్రబాబు కొనియాడారు. ప్రపంచవ్యాప్తంగా 10 కోట్ల మంది తెలుగు మాట్లాడుతున్నారని చెప్పారు. తెలుగు మహా సభలకు 40 దేశాల నుంచి ప్రతినిధులు రావడం హర్షించదగిన విషయమన్నారు.

మారిషస్ దేశ అధ్యక్షుడితో సీఎం భేటీ

ప్రపంచ తెలుగు మహా సభల్లో పాల్గొనేందుకు వచ్చిన మారిషస్ దేశ అధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్‌తో.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అదేవిధంగా.. గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజుతోనూ సీఎం భేటీ అయ్యారు. ఉత్తరాంధ్ర రీజియన్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టామని వివరించారు. భోగాపురంలో నిర్మించే జీఎంఆర్-మాన్సాస్ ఏవియేషన్ ఎడ్యు సిటీకి భూమి ఇచ్చినందుకు అశోక్ గజపతిరాజుకు.. సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు.

జనవరి 5 సేవల్లో తేడా రావొద్దు!

సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు.. ఈ వారం కూడా రివ్యూ నిర్వహించారు.కొత్త సంవత్సరంలో ప్రభుత్వ శాఖలన్నీ ప్రజలకు అత్యుత్తమంగా సేవలందించాలని కోరారు. పౌర సేవలన్నీ క్షేత్రస్థాయిలో మరింత మెరుగ్గా అందించేలా కృషి చేయాలని ఆదేశించారు.

## భారత్ స్థానం ఎంతంటే..?

న్యూఢిల్లీ,ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన పాస్‌పోర్టుల జాబితా విడుదలైంది. ఈ జాబితాలో సింగపూర్ తొలి స్థానంలో నిలిచింది. ఇక భారత్ 80వ స్థానంలో ఉంది. వీసా రహితంగా ట్రావెల్ చేయగలిగిన గమ్యస్థానాల ఆధారంగా హెన్లీ పాస్‌పోర్ట్ ఇండెక్స్ ఏటా ర్యాంకింగ్స్ ఇస్తుంది. ఈ ఏడాది కూడా శక్తిమంతమైన పాస్‌పోర్టుల జాబితాను విడుదల చేసింది. మొత్తం 199 దేశాల్లో అత్యంత శక్తిమంతమైన పాస్‌పోర్ట్‌ల జాబితాను ప్రకటించింది.

వరుసగా మూడోసారి సింగపూర్..

ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన పాస్‌పోర్ట్‌ల జాబితాలో సింగపూర్ వరుసగా మూడో ఏడాది కూడా తొలి స్థానంలో నిలిచింది. సింగపూర్ పాస్‌పోర్టుతో 192 దేశాలకు వీసా లేకుండానే ప్రయాణించొచ్చు. ఇక సింగపూర్ తర్వాత జపాన్, దక్షణ కొరియా దేశాలు రెండో స్థానంలో ఉన్నాయి. ఈ దేశాల పాస్‌పోర్టులతో దాదాపు 188 దేశాలను వీసా లేకుండానే చుట్టేయొచ్చు. డెన్మార్క్, లక్సెంబర్గ్, స్పెయిన్, స్వీడన్, స్విట్జర్లాండ్ దేశాలు సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచాయి. ఈ దేశాల పాస్‌పోర్టులు కలిగిన వారు 186 గమ్యస్థానాలకు వీసా లేకుండానే ప్రయాణించే వీలు ఉంది. ఆస్ట్రియా, బెల్జియం, ఫిన్లాండ్, ఫ్రాన్స్, జర్మనీ, గ్రీస్, ఐర్లాండ్, నెదర్లాండ్స్, నార్వే దేశాలు నాలుగో స్థానంలో ఉన్నాయి. ఈ దేశాల పాస్‌పోర్టులతో 185 దేశాలను వీసా లేకుండానే చుట్టేయొచ్చు. హంగరీ, పోర్చుగల్, స్లోవేకియా, స్లోవేనియా , యూఏఈ దేశాలు ఐదో స్థానం నిలిచాయి. ఈ దేశాల పాస్‌పోర్టులతో 184 దేశాలను చుట్టేయొచ్చు. క్రొయేషియా, చెక్ రిపబ్లిక్, ఎస్టోనియా, మాల్టా, న్యూజిలాండ్, పోలాండ్ దేశాలో ఆరో స్థానంలో ఉన్నాయి. ఈ దేశాల పాస్‌పోర్టులతో వీసా లేకుండానే 183 దేశాల్లో తిరగొచ్చు. ఆస్ట్రేలియా, లాట్వియా, లీచ్టెన్‌స్టెయిన్, యునైటెడ్ కింగ్‌డమ్ 182 స్కోర్‌తో ఏడో స్థానంలో నిలవగా.. కెనడా, ఐస్లాండ్, లిథువేనియా దేశాలు 181 స్కోర్‌తో ఎనిమిదిఓ స్థానంలో ఉన్నాయి. మలేషియా (180) తొమ్మిదో స్థానంలో, ఇక అగ్రరాజ్యం అమెరికా 179 స్కోరుతో 10వ స్థానంలో నిలిచాయి.

భారత్ ర్యాంక్

ఇక భారత్ విషయానికొస్తే.. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన పాస్‌పోర్టుల జాబితాలో భారత్ గతేడాదితో పోలిస్తే కాస్త దిగజారింది. 2025 జాబితాలో భారత్ 77వ స్థానంలో నిలివగా.. ఇప్పుడు మూడు పాయింట్లు దిగజారి 80వ స్థానానికి చేరింది. వీసా రహితంగా ప్రయాణించగల దేశాల సంఖ్య గతేడాది 59గా ఉండగా.. ఇప్పుడు 55కి తగ్గింది.

# మున్సిపోల్స్ వేళ కాంగ్రెస్ పెద్దల్లో కలవరం..!



హైదరాబాద్,అటో ఇటో పంచాయతీ పోరు నుంచి గట్టెక్కారు. ఇక పుర పోరు రాబోతోంది. వార్ వన్ సైడే అంటూ పైకి చెప్తున్నా..కొన్ని మున్సిపాలిటీల్లో ఉన్న పొలిటికల్ సీన్ కాస్త హస్తం పార్టీని కలవరపెడుతోందట. ఐదు నియోజవర్గాల్లో ఉన్న కాంగ్రెస్ అంతర్గత పోరు..అధికార పార్టీ పెద్దలకు ఆందోళన కలిగిస్తోందట. ఆ మున్సిపాలిటీల్లో వర్గపోరుకు చెక్ పెట్టేదెలా? సీఎం రేవంత్ దగ్గరున్న చిట్కా ఏంటి? ఆ పెద్ద నేతను రంగంలోకి దింపితే ఆల్ సెట్టా?తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. నోటిఫికేషన్ రానప్పటికీ అన్ని రాజకీయ పార్టీలు మున్సిపల్ పోరుకు కసరత్తు స్పీడప్ చేశాయి. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్, మరోవైపు బీజేపీ ఉమ్మడి జిల్లాల వారీగా సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నాయి. ఇక సీఎం రేవంత్ కూడా జిల్లాల టూర్‌కు రూట్ మ్యాప్ రెడీ చేసి పెట్టారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన అన్ని ఎన్నికల్లో విజయం సాధించినట్టే మున్సిపల్ ఎన్నికల్లో తమ సత్తా చాటుతామని అధికార కాంగ్రెస్ ధీమాగా ఉంది. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి మెజార్టీ స్థానాలను కైవసం చేసుకోవాలని బీఆర్ఎస్ రెడీ అవుతోంది. ఇక పురపాలక ఎన్నికలు జరిగేది పూర్తిగా అర్బన్ ప్రాంతం కావడం..ప్రాంతాల్లో తమకే పట్టు ఉందని పుర పోరులో కాషాయ జెండా ఎగరవేస్తామంటోంది బీజేపీ.

కాంగ్రెస్ ను టెన్షన్ పెడుతున్న 5 నియోజకవర్గాలు..

తెలంగాణలో 131 మున్సిపాలిటీలు, 15 మున్సిపల్ కార్పొరేషన్లు ఉన్నాయి. వీటిలో కనీసం 90 శాతం కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ కసరత్తు చేస్తోంది. అయితే బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో మున్సిపల్ ఎన్నికలు అధికార కాంగ్రెస్ పార్టీ పెద్దలకు సవాల్‌గా మారాయట. ముఖ్యంగా ఐదు నియోజకవర్గాల్లో పాత కాంగ్రెస్ వర్సెస్ కొత్త కాంగ్రెస్ నేతల మధ్య మాటల యుద్ధం రోజురోజుకి ముదురుతోందట. ఈ సమస్యను ఎలా అధిగమించాలో తెలియక హస్తం పార్టీ నేతలు తలలు పట్టుకుంటున్నారట.

పాత కొత్త నేతల మధ్య వివాదం..

అయితే పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి రెబల్స్ రూపంలో అంతో ఇంతో ఇబ్బంది కలిగింది. ఇక మున్సిపల్ ఎన్నికల్లో కూడా సేమ్ సీన్ రిపీట్ అయితే పెద్ద బొక్క బోర్లా పడటం ఖాయమని భావిస్తున్నారట. జగిత్యాల, గద్వాల్, బాన్సువాడ, చేవెళ్ల, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గాల్లో పాత కొత్త నేతల మధ్య వివాదం తీవ్రంగా ఉందట. జగిత్యాలలో కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే సంజయ్ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. మున్సిపల్ ఎన్నికల్లో టికెట్లు ఇచ్చేది తానేనని, వేరే వాళ్లు ఇన్వాల్వ్ అయితే కథ వేరే ఉంటుందంటూ జీవన్‌రెడ్డి వార్నింగ్‌లు ఇస్తున్నారు.ఇక గద్వాల్‌లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓడిన సరిత తిరుపతయ్యకు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మధ్య కోల్డ్ వార్ నడుస్తూనే ఉంది. స్టేషన్ ఘన్‌పూర్ కొత్తగా మున్సిపాలిటీ అయింది. అక్కడ కూడా కడియం శ్రీహరి, ఇందిరా మధ్య వివాదం నడుస్తోంది. చేవెళ్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన భీం భరత్, కాంగ్రెస్‌లోకి వచ్చిన ఎమ్మెల్యే కాలే యాదయ్య మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఇక బాన్సువాడలో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన ఏనుగు రవీందర్ రెడ్డి, కాంగ్రెస్‌లోకి వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి మధ్య నిత్యం ఏదో ఒక ఇష్యూ జరుగుతూనే ఉంది.ఇలాంటి పరిస్థితుల్లో ఈ ఐదు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీకి.. పురపోరులో రెబల్స్ బాధ తప్పేలా లేదు. పోటీ చేసి ఓడిపోయిన ఎమ్మెల్యే అభ్యర్థులు, కొత్తగా పార్టీలోకి వచ్చిన ఎమ్మెల్యేలు రెండు వర్గాలుగా విడిపోయి తమ మద్దతుదారులను టికెట్ ఇప్పించుకోవాలని ఎత్తులు వేస్తున్నారు. ఒకవేళ తమ వర్గానికి టికెట్ రాకపోతే రెబల్‌గా పోటీ చేసి తీరుతామని రెండు వర్గాల నేతలు ఓపెన్ ఛాలెంజ్ చేసుకుంటున్నారు. ఈ వర్గపోరుకు ఎలా చెక్ పెట్టాలి..సయోధ్య కుదిర్చేది ఎలా అని కాంగ్రెస్ పెద్దలు తర్జనభర్జన పడుతున్నారట.ఐదు నియోజకవర్గాల్లో రెండు వర్గాల నేతలు కలిసి పనిచేస్తేనే అనుకున్న రిజల్ట్ వస్తుందని భావిస్తున్నారట. అందుకే ఇంచార్జ్ మీనాక్ష నటరాజన్‌ను ఐదు నియోజకవర్గాలకు పంపాలని పార్టీ నిర్ణయించిందట. గొడవలకు చెక్ పెట్టి, రెబల్స్ నుంచి పోటీ లేకుండా నేతల మధ్య సయోధ్య కుదిర్చే ప్రయత్నం చేయబోతున్నారట మీనాక్ష నటరాజన్. ఇక పార్టీ నుంచి ఒక కమిటి వేసి, సర్వేల ఆధారంగా గెలిచే అభ్యర్థులకు టికెట్ ఇవ్వాలని డిసైడ్ అయ్యారట. స్థానికంగా పట్టు కోసం ఫైటింగ్‌కు దిగుతున్న నేతలు మీనాక్ష మాట వింటారా? లేక యాజ్‌టీజ్‌గా వర్గపోరుకు దిగుతారా అనేది చూడాలి.

# కారు పార్టీలో కాకరేపుతున్న సిర్పూర్ రాజకీయం...

హైదరాబాద్,మొన్న జరిగిన పంచాయతీ ఎన్నికలు మరోసారి కోనప్ప, ప్రవీణ్ కుమార్ వర్గ పోరుకు తెరలేపాయన్న టాక్ వినిపిస్తోంది. సర్పంచ్ ఎన్నికల్లో కోనప్ప, ప్రవీణ్ కుమార్ పోటాపోటీగా అభ్యర్థుల్ని నిలబెట్టి బలపరిచారు.చంటిగాడు లోకల్ అంటారొకరు. ఇది నా ఇలాకా అంటారు మరొకరు. నా సీటు ఇక్కడి నుంచే పోటీ చేస్తానని ఒకరు.. ఆల్రెడీ ఎమ్మెల్యేగా పనిచేశా..మళ్లీ అక్కడి నుంచే పోటీ చేస్తానని మరొకరు. అటు కోనప్ప, ఇటు ఆర్ఎస్పీ..ఎవరూ తగ్గకపోవడంతో..సిర్పూర్ రాజకీయం కారు పార్టీలో కాక రేపుతోందట. ఇద్దరు నేతల మధ్య వర్గపోరు పీక్ లెవల్‌కు చేరడంతో గులాబీ పార్టీకి తలనొప్పిగా మారిందన్న టాక్ వినిపిస్తోంది.తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయం ఉంది. కానీ బీఆర్ఎస్ పార్టీలో అప్పుడే టికెట్ల లొల్లి మొదలైంది. కొన్ని నియోజకవర్గాల్లో ఇద్దరు ముగ్గురు సీటు ఆశిస్తుండటం ఆసక్తికరంగా మారుతోంది. సిర్పూర్ కాగజ్ నగర్ రాజకీయం అయితే బీఆర్ఎస్ పార్టీకి తలనొప్పిగా మారిందన్న చర్చ జరుగుతోంది. ఇక్కడ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వర్గపోరుపై గులాబీ బాస్ కేసీఆర్ అసహనం వ్యక్తం చేస్తున్నట్లు తెలంగాణ భవన్ వర్గాల టాక్. పంచాయతీ ఎన్నికల తర్వాత కోనేరు కోనప్ప, ఆర్ఎస్పీ మధ్య వర్గ విభేదాలు నెక్స్ట్ లెవల్‌కు చేరాయన్న టాక్ వినిపిస్తోంది.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బీఆర్ఎస్ ఎక్కువ గ్రామాల్లో సర్పంచ్ స్థానాలు గెలిచిన నియోజకవర్గాల్లో సిర్పూర్ కాజగ్ నగర్ ఒకటిగా చెప్పాలి. ఇక్కడ గులాబీ పార్టీ ఎమ్మెల్యే లేరు. అయినప్పటికీ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పోటా పోటీగా పనిచేసి మెజార్టీ సర్పంచులను గెలిపించుకున్నారు. ఇది పార్టీకి మంచే చేసినా వీరిద్దరి రాజకీయం ఆందోళన కలిగిస్తోందన్న చర్చ జరుగుతోంది.

అతడి వల్లే ఓడిపోయాయని సీరియస్..

2023లో అసెంబ్లీ ఎన్నికల్లో కోనేరు కోనప్ప, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ రాజకీయ ప్రత్యర్థులు. అప్పుడు బీఆర్ఎస్ పార్టీ తరఫున కోనప్ప పోటీ చేయగా, బీఎస్పీ నుంచి ఆర్ఎస్ పోటీ చేశారు. అయితే చివరికి ఇద్దరూ ఓడిపోయి మధ్యలో బీజేపీ నేత పాల్వాయి హరీష్ బాబు విజయం సాధించారు. ఆర్ఎస్ ప్రవీణ్ పోటీ చేయడంతో ఓట్లు చీలి తాను ఓడిపోయానని కోనప్ప గుర్రుగా ఉన్నారట. అయితే ఆ తర్వాత జరిగిన పరిణామాల్లో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బీఆర్ఎస్‌లో చేరడంతో కోనప్ప అలిగి ఆ పార్టీకి గుడ్ బై చెప్పి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.సీఎం రేవంత్ రెడ్డి తనకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేరారు కోనప్ప. ఆయన చేరికను బహిరంగంగా వ్యతిరేకించకపోయినా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాత్రం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారట. ఈ క్రమంలో ప్రస్తుతం సిర్పూర్ కాగజ్ నగర్‌లో ఓవైపు కోనేరు కోనప్ప, మరోవైపు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఇద్దరూ బీఆర్ఎస్ తరఫున పనిచేస్తూ వస్తున్నారు.

మరోసారి వర్గ పోరు..

ఈ క్రమంలో మొన్న జరిగిన పంచాయతీ ఎన్నికలు మరోసారి కోనప్ప, ప్రవీణ్



కుమార్ వర్గ పోరుకు తెరలేపాయన్న టాక్ వినిపిస్తోంది. సర్పంచ్ ఎన్నికల్లో కోనప్ప, ప్రవీణ్ కుమార్ పోటాపోటీగా అభ్యర్థుల్ని నిలబెట్టి బలపరిచారు. కోనప్ప వర్గం 54, ప్రవీణ్ కుమార్ వర్గం 20 గ్రామ పంచాయతీలను గెలుచుకుందట. అధిక పంచాయతీలను గెలిపించుకున్న కోనప్ప వర్గం హుషారుగా ఉండగా, ఆర్ఎస్పీతో పాటు ఆయన అనుచరులు మాత్రం కాస్త చతికిలపడిపోయారట. ఈ క్రమంలోనే పార్టీ ప్రోటోకాల్ పాటించడం లేదని మాజీ ఎమ్మెల్యే కోనప్ప మీద పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఫిర్యాదు చేశారట ఆర్ఎస్పీ.

టికెట్లు ఇచ్చే అధికారం తమకే ఇవ్వాలని డిమాండ్..

పార్టీ సింబల్ లేని సర్పంచ్ ఎన్నికలకే ఇంత తతంగం జరిగితే..ఇక పార్టీ గుర్తులతో జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో వీరి రాజకీయం ఎలా ఉంటుందోనన్న ఆందోళన బీఆర్ఎస్ అధిష్టానంలో కనిపిస్తోందట. ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో బీఫారాలు ఇచ్చే అధికారం ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కే ఇవ్వాలని ఆయన అనుచరులు డిమాండ్ చేస్తున్నారట. అయితే ఎక్కువ సర్పంచ్ స్థానాలు గెలిపించిన కోనప్పకే పార్టీలో పరపతి ఉంటుందని, టికెట్లు ఇచ్చే అధికారం కోనప్పకే ఇవ్వాలంటూ ఆయన వర్గం కోరుతోందట.

గులాబీ పార్టీ హైకమాండ్‌కు తలనొప్పి..!

గెలిపించుకున్న సర్పంచ్‌లతో కలిసి నేరుగా కేసీఆర్ దగ్గరికి వెళ్లి అసలు విషయం చెప్పాలని కోనేరు కోనప్ప భావిస్తుండగా, అధిష్టానం తగ్గర తాడో పేడో తేల్చుకోవాలని ఆర్ఎస్పీ అనుకుంటున్నారట. ఇదంతా వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇద్దరు లీడర్లు దూకుడు పెంచారన్న టాక్ వినిపిస్తోంది. రాబోయే ఎన్నికల్లో తనకు టికెట్ ఇస్తారని కోనేరు కోనప్ప చెప్పుకుంటుండగా, కచ్చితంగా తాను సిర్పూర్ నుంచే పోటీ చేస్తానని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ శపథం చేస్తున్నారట. దీంతో సిర్పూర్ కాగజ్ నగర్ రాజకీయం గులాబీ పార్టీ హైకమాండ్‌కు తలనొప్పిగా మారిందన్న చర్చ జరుగుతోంది.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో సమన్వయం చేసుకోవాలని కోనేరు కోనప్పకు గతంలో అధినేత కేసీఆర్ సూచించారని గుర్తు చేస్తున్నారు. అయితే సర్పంచ్ ఎన్నికలు కాస్త మళ్లీ వీళ్లిద్దరి మధ్య రాజకీయ విభేదాలను రాజేశాయని, మరి కోనప్ప, ఆర్ఎస్పీ విషయంలో కారు పార్టీ అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటున్నది ఉత్కంఠ రేపుతోంది.

# పవార్ కుటుంబానికి ఎదురుదెబ్బ..శరద్ పవార్, అజిత్ పవార్‌లకు దక్కని విజయం

ముంబై,మహారాష్ట్రలో స్థానిక సంస్థల ఎన్నికల కోసం పవార్, ఠాక్రే కుటుంబాలు చేతులు కలిపిన విషయం తెలిసిందే. అదేతరహాలో శరద్ పవార్, అజిత్ పవార్ పార్టీలు.. పుణె, పింప్రీ-చించ్‌వడ్ మున్సిపల్ కార్పొరేషన్లలో కలిసి పోటీ చేశాయి. కానీ, ఫలితాల విషయానికొస్తే తేలిపోయినట్లు కనిపిస్తున్నాయి. ఓట్ల లెక్కింపులో తాజా వివరాల ప్రకారం రెండు కార్పొరేషన్లలోనూ వెనుకంజలో ఉన్నాయి. పుణెలో భాజపా భారీ ఆధిక్యంలో ఉంది. ఇక్కడ 165 వార్డులు ఉండగా.. భాజపా 50కి పైగా స్థానాల్లో ముందంజలో ఉంది. ఎన్సీపీ.. ఐదు, ఎన్సీపీ (ఎస్పీ) కేవలం రెండు స్థానాలకే పరిమితమయ్యాయి. పింప్రి చించ్‌వడ్ కార్పొరేషన్‌లో 127 వార్డులు ఉన్నాయి. భాజపా 70కి పైగా స్థానాల్లో ముందంజలో ఉంది. ఎన్సీపీ 39, ఎన్సీపీ (ఎస్పీ) ఒక స్థానంలో ఆధిక్యంలో ఉన్నాయి. బృహన్ముంబయి మున్సిపల్ ఎన్నికల్లో ఠాక్రే సోదరులదీ ఇదే పరిస్థితి. మొత్తం 227 వార్డుల్లో భాజపా ఇప్పటివరకు 88, శివసేన 31 స్థానాల్లో ఆధిక్యంతో మెజారిటీ మార్కు దాటాయి. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) 63, రాజ్ ఠాక్రేకు చెందిన మహారాష్ట్ర నవ్‌నిర్మాణ్ సేన (ఎంఎన్ఎస్)




6 స్థానాల్లో ముందంజలో ఉన్నాయి. కాంగ్రెస్ 6 సీట్లకే పరిమితమయ్యింది. రాష్ట్రవ్యాప్తంగానూ భాజపా తన హవా కొనసాగిస్తోంది. బృహన్ముంబయి, నవీ ముంబయి, నాసిక్, పన్వేల్, శంభాజీనగర్, నాగ్‌పుర్, అకోలా, జాల్నాలో ఆధిక్యంలో ఉంది. అమరావతిలో కాంగ్రెస్, ఠాణెలో శివసేన, పర్భణీలో శివసేన (యూబీటీ) ముందంజలో ఉన్నాయి.

# మేడారం జాతరలో నయా "బిజినెసు..



ములుగు, మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతరకు సమయం సమీపిస్తుంది. ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన మేళాగా పేరుగాంచిన ఈ ఉత్సవం.. ప్రతి రెండేళ్లకోసారి జరుగుతోంది. ఇందుకోసం దేశం నలుమూలల నుంచి మాత్రమే కాకుండా విదేశాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు తరలివస్తుంటారు. అందుకే ఈ జాతరను "దక్షణ భారత కుంభమేళా" అని కూడా పిలుస్తారు. గిరిజన సమాజం ఆరాధించే ఈ జాతరలో గిరిజన సంప్రదాయాలు, వారి పూజా విధానాలు, సంస్కృతి ప్రతిబింబిస్తాయి. కేవలం ఆధ్యాత్మిక ఉత్సవం మాత్రమే కాకుండా, ఇది గిరిజన గౌరవానికి ప్రతీకగా అభివర్ణిస్తారు.మరికొద్ది రోజుల్లో ఈ జాతరను ఘనంగా నిర్వహించనున్నారు. జనవరి 28 నుంచి 31 వరకు ఈ మహా జాతర వైభవంగా జరగనుంది. జనవరి 28న సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెలపై కొలువుదీరనున్నారు. జనవరి 29న సమ్మక్క తల్లి చిలకలగుట్ట నుంచి గద్దెలకు చేరుకుంటారు. జనవరి 30న భక్తులు పెద్ద ఎత్తున మొక్కులు చెల్లించుకోనున్నారు. జనవరి 31న అమ్మవార్ల వనప్రవేశంతో జాతర ముగుస్తుంది. మూడో రోజైన జనవరి 30న సమ్మక్క, సారలమ్మతో పాటు గోవిందరాజు, పగిడిద్దరాజుల వనప్రవేశం ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. ఈ రోజు దేశం నలుమూలల నుంచి భక్తులు విపరీతంగా తరలి వచ్చి బంగారం, వెండి, జుట్టు, కోడిపుంజులు, తేనె, చెల్లింపు డబ్బులు వంటి విభిన్న రకాల మొక్కులు సమర్పిస్తారు.కాగా ఈ నేపథ్యంలో భక్తుల రద్దీ రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల ప్రజలు కూడా అమ్మవార్లను దర్శించుకోవడానికి తండోపతండాలుగా వస్తున్నారు. అయితే కొబ్బరికాయలు, బెల్లం (బంగారం), పూజా సామగ్రి అమ్మకాలకు ఇప్పటికే అధికారులు టెండర్లు వేసి ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు. కానీ భక్తుల అవసరాలను ఆసరాగా చేసుకుని కొత్త బిజినెస్ లు సైతం తెరపైకి రావడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.ప్రస్తుతం పండుగ వాతావరణంతో పాటు చలి తీవ్రత కూడా అధికంగా ఉంది. దీంతో భక్తులు జంపన్న వాగులో స్నానాలు చేసేందుకు ఒకింత వెనుకడుగు వేస్తున్నారు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకున్న కొందరు వ్యక్తులు జంపన్న వాగు సమీపంలో వేడి నీళ్ల విక్రయిస్తున్నారు. ఒక బకెట్ వేడి నీటిని రూ.50 చొప్పున అమ్ముతూ రూ.వేలల్లో సంపాదిస్తున్నారు. చలిలో స్నానం చేయలేని వారంతా వేడి నీటిని కొనుగోలు చేసి పని కానిచ్చేస్తున్నారు. దీంతో ఈ బిజినెస్ చేస్తున్న వారి తెలివితేటలు గ్రేట్ అంటూ కామెంట్స్ వినిపిస్తున్నాయి.

### కన్యాకుమారిలో రోడ్డు ప్రమాదం

మంచిర్యాల,తమిళనాడులోని కన్యాకుమారి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన దంపతులు మరణించారు. అయ్యప్ప మాల ధరించిన వారు.. శబరిమలకు వెళ్లొస్తుండగా ఈ దారుణం జరిగింది.వివరాల్లోకి వెళ్తే.. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటకు చెందిన పాలకుర్తి సత్యనారాయణ (63), రమాదేవి (59) జనరల్ స్టోర్ నిర్వహిస్తున్నారు. ఇటీవల అయ్యప్ప మాల ధరించిన ఈ దంపతులు జనవరి 8వ తేదీన ఓ ప్రైవేటు సర్వీస్‌లో శబరిమల దర్శనానికి వెళ్లారు. జనవరి 15వ తేదీన మకర సంక్రాంతి రోజున అయ్యప్ప స్వామి దర్శనం చేసుకుని తిరిగి బయల్దేరారు. ఈ క్రమంలో కన్యాకుమారి సమీపంలో బైపాస్ రోడ్డులో బస్సును ఆపారు. అక్కడ సముద్ర స్నానం చేసుకుని దేవాలయాలు సందర్శించుకుని బస్సు దగ్గరకు వస్తుండగా వారికి ఓ వాహనం ఢీకొట్టింది.

# పోచారం ఇంకా బిఆర్ఎస్‌లోనే ఉన్నాడని అంటారా?



నిజామాబాద్,చట్టసభల గౌరవాన్ని హక్కులను రక్షించాల్సిన అసెంబ్లీ స్పీకర్ భక్షకుడుగా మారడం శోచనీయమని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు , మాజీ ఎమ్మెల్యే, ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ ఆరోపించారు. స్పీకర్ జడ్జిమెంట్ రాష్ట్ర అసెంబ్లీ చరిత్రలో చీకటి రోజుగా అభివర్ణించారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి ఇంకా బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నారని, పార్టీ మారినట్లు ఎలాంటి ఆధారాలు లేవని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీర్పునివ్వడం రాష్ట్ర చట్టసభల గౌరవాన్ని దిగజార్చిందని అన్నారు. నిజామాబాద్ జిల్లా రాజకీయాల్లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు ప్రజాస్వామ్య వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీసే విధంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి పార్టీ ఫిరాయింపు చేసినప్పటికీ, అనర్హత వేటు వేయకపోవడం రాజ్యాంగ విరుద్ధమైన చర్యగా మారిందని అభిప్రాయ పడ్డారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం స్పష్టంగా ఉన్నా, దాన్ని అమలు చేయడంలో స్పీకర్ నిర్లక్ష్యం, ప్రజాస్వామ్యంపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీస్తోందన్నారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి అవలంబిస్తున్న ఈ అనైతిక రాజకీయ విధానం ప్రజలు ఇచ్చిన తీర్పుకు విరుద్ధమని దుయ్యబట్టారు. బిఆర్ఎస్ బీ ఫామ్ కింద గెలిచి, మంత్రిగా ఉన్నత పదవులు అనుభవించి, కాంగ్రెస్ పార్టీ లోకి ఫిరాయించిన పోచారం తాను బీఆర్ఎస్ కొనసాగుతున్నారని చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. నిజంగా బిఆర్ఎస్ పార్టీలోనే ఉంటే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలకు తన చిత్తశుద్ధిని చాటాలని డిమాండ్ చేశారు. జీవిత చరమాంకంలో ఉన్న విలువ తీసుకోవద్దని పోచారానికి హితవు పలికారు. మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు కేటాయించకుండా ముందుకెళ్లడం ద్వారా కాంగ్రెస్ పార్టీ బీసీ లను మరోసారి వంచించిందని బాజిరెడ్డి గోవర్ధన్ స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను తగ్గించడం మరో ప్రజావ్యతిరేక నిర్ణయంగా మారిందని ఆరోపించారు. బీసీ వర్గాల హక్కులను కాలరాసేలా తీసుకున్న ఈ నిర్ణయం సామాజిక న్యాయ సూత్రాలకు పూర్తిగా విరుద్ధమని స్పష్టం చేశారు. బీసీ వర్గాలు రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న తరుణంలో, వారి ప్రాతినిధ్యాన్ని తగ్గించే ప్రయత్నాలు ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పుగా మారతాయని, కాంగ్రెస్ ప్రభుత్వ బీసీ వ్యతిరేక విధానానికి బీసీ లు రాబోయే ఎన్నికల్లో గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

# నీరవ్ మోడీ కేసులో ఈడి దర్యాప్తు...

న్యూఢిల్లీ,పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు రూ.వేల కోట్లు ఎగవేసి పారిపోయిన వ్యాపారవేత్త, ఆర్థిక నేరగాడు మెహుల్ ఛోక్సీ కేసుపై ఈడీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఎనిమిదేళ్లుగా కొనసాగుతోన్న దర్యాప్తులో భాగంగా ఈడీ అధికారులు తాజాగా కీలక విషయం వెల్లడించారు. ఈ మనీలాండరింగ్ కేసులో మెహుల్ ఛోక్సీ కుమారుడు రోహన్ చోక్సీకి కూడా సంబంధం ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు దిల్లీలోని అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు వివరాలు వెల్లడించారు. మెహుల్ చోక్సీ డైరెక్టర్‌గా ఉన్న లస్టర్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీలో రోహన్ చోక్సీకి 99.99 శాతం వాటా ఉందని.. ఈ కంపెనీ నిధులను వారు విదేశాలకు మళ్లించడానికి ఉపయోగించుకున్నారని దర్యాప్తులో తేలినట్లు ఈడీ అధికారులు పేర్కొన్నారు. నగదు అక్రమ చలామణిలో రోహన్ చోక్సీ చురుకుగా పాల్గొన్నట్లు తగిన ఆధారాలు ఉన్నాయన్నారు. దీంతో అతడి ఆస్తులను అటాచ్ చేయడానికి సిద్ధమవుతున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో రోహన్‌తో పాటు ఇతర కుటుంబసభ్యులను కూడా విచారించడానికి ఈడీ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ నుంచి తీసుకున్న దాదాపు రూ.13 వేల కోట్ల రుణాలను ఎగ్గొట్టిన ఛోక్సీ, అతడి మేనల్లుడు నీరవ్ మోదీ దేశం విడిచి పారిపోయారు. ఛోక్సీ ఆంటిగ్వా-బార్బుడాకు వెళ్లగా.. నీరవ్‌మోదీ లండన్‌లో



ఆశ్రయం పొందాడు. ప్రస్తుతం నీరవ్ లండన్‌లోని జైల్లో ఉన్నాడు. వారిని భారత్‌కు తీసుకురావడానికి విదేశాంగ అధికారులు ఆయా దేశాల అధికారులతో చర్చలు జరుపుతున్నారు.

# అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మీషో సహా పలు సంస్థలకు షాక్

న్యూఢిల్లీ, చట్టవిరుద్ధంగా వాకీ టాకీలను విక్రయిస్తున్న పలు ఈ-కామర్స్ సంస్థలపై కేంద్ర వినియోగదారుల రక్షణ ప్రాధికార సంస్థ సుమోటోగా చర్యలు చేపట్టింది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మీషో సహ పలు ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లపై మొత్తంగా రూ.44లక్షల వరకు జరిమానా విధించింది. వినియోగదారుల రక్షణ, టెలికాం చట్టాలను ఉల్లంఘించి పలు ఈ-కామర్స్ సంస్థలు నిబంధనలకు అనుగుణంగా లేని ఉత్పత్తులను లిస్ట్ చేసి విక్రయిస్తున్నట్లు సీసీపీఏ గుర్తించింది. సాధారణంగా 446.0-446.2 బ్యాండ్‌లోని పర్సనల్ మొబైల్ రేడియోలకు మాత్రమే లైసెన్స్ మినహాయింపు వర్తిస్తుంది. మిగతా వాటి దిగుమతి, విక్రయాల కోసం తప్పనిసరిగా ఎక్విప్‌మెంట్ టైప్ అప్రూవల్ సర్టిఫికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. అంతేగాక, లైసెన్సింగ్ నిబంధనలకు సంబంధించిన వివరాలను కూడా విక్రయదారులు స్పష్టంగా తెలియజేయాలి. అయితే, ఫ్లిప్‌కార్ట్ , అమెజాన్ , మీషో , జియో మార్ట్ తదితర ఈ-కామర్స్ సంస్థలు ఈ నిబంధనలను ఉల్లంఘించి నట్లు అఅఖం తెలిపింది. లైసెన్స్ మినహాయింపు ఫ్రీక్వెన్సీ రేంజ్




దాటి ఉన్న వాకీ టాకీలను ఈ కంపెనీలు విక్రయించినట్లు పేర్కొంది. ఇందుకుగానూ మీషో, మెటా, ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ సంస్థలకు రూ.10లక్షల చొప్పున జరిమానా విధించింది. చిమియా, జియో మార్ట్, టాక్ ప్రో, మాస్క్‌మ్యాన్ టాయ్స్ సంస్థలకు రూ.లక్ష చొప్పున్న ÷న్ వేసింది. వీటిలో మీషో, మెటా, చిమియా, జియో మార్ట్, టాక్ ప్రో ఇప్పటికే పెనాల్టీలు చెల్లించినట్లు సీసీపీఏ వెల్లడించింది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com